# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - గురువారం 6 ఆగష్టు 2026 ‖ సంపుటి: 10 ‖ సంచిక: 213 ‖ పేజీలు: 8+4 ‖ వెల రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM


## శ్రీ వరలక్ష్మీ వ్రతానికి తిరుచానూరులో విస్తృత ఏర్పాట్లు

3

## చికిత్స పేరుతో చంపేసిండ్రు

2

## రూ.9.50 లక్షల కోట్ల పెట్టుబడులతో..

# విశాఖ ఎకనామిక్ రీజియన్

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక రూపురేఖలను మార్చేలా రూ.9.50 లక్షల కోట్ల భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికలను ప్రభుత్వం రూపొందిస్తోంది.



### ఏపీ సీఎం చంద్రబాబు

■ పి.మీరాహుస్సే ఖాన్

**అమరావతి, (మనం ప్రత్యేక ప్రతినిధి):** విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం అమరావతిలోని తన క్యాంప్ కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.3.50 లక్షల కోట్ల నుంచి రూ.4 లక్షల కోట్ల వరకు పెట్టుబడి పెట్టనుండగా, మిగిలిన రూ.5.30 లక్షల కోట్లను ప్రైవేట్ రంగం నుండి రాబట్టేలా పక్కా కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సూక్ష్మస్థాయి ప్రణాళిక ద్వారా ఈ రీజియన్ మొత్తాన్ని అంతర్జాతీయ స్థాయి ఆర్థిక హబ్గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ సంకల్పమని సీఎం స్పష్టం చేశారు. ఈ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, విశాఖ ఎకనామిక్ రీజియన్ పరిధిలోని ప్రతి ప్రాంతాన్ని, ప్రతి రంగాన్ని పరిగణనలోకి తీసుకుని సమగ్రాభివృద్ధి సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని అధికారులకు

...మిగతా 2లో

### వంద మంది సింధులు రావాలి

## సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సెలెన్స్‌కు లోకేష్ శంకుస్థాపన

విశాఖను దేశంలోనే అత్యుత్తమ క్రీడా హబ్గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని, విశాఖ అకాడమీ ద్వారా వందలాది మంది 'పీవీ సింధు'లు తయారవ్వాలని మంత్రి లోకేష్ ఆకాంక్షించారు

**విశాఖపట్నం, మనం న్యూస్ ప్రత్యేక ప్రతినిధి:** భవిష్యత్ ఒలింపిక్ ఛాంపియన్లను తయారుచేసే లక్ష్యంతో విశాఖపట్నం వేదికగా ప్రతిష్టాత్మక 'పీవీ సింధు సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సెలెన్స్' నిర్మాణ పనులకు బుధవారం అంకురార్పణ జరిగింది. నగరంలోని అరిలోవ తోటగరువులో ఏర్పాటు చేయనున్న ఈ మెగా క్రీడా అకాడమీకి ఏపీ ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా హాజరై భూమిపూజ చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పీవీ సింధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో

...మిగతా 2లో

## ఐబీఎం ఫ్యూచర్ నౌ సెంటర్

### విశాఖలో ప్రారంభించిన మంత్రి లోకేష్

**విశాఖపట్నం, మనం న్యూస్:** ప్రపంచ దిగ్గజ ఐటీ సంస్థ ఐబీఎం(ఐబియం) విశాఖపట్నంలో తన నూతన ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్ నౌ సెంటర్ ను ప్రారంభించింది. ప్రపంచవ్యాప్తంగా ఏఐ, డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ సేవలకు మద్దతుగా విశాఖ ఇసుకతోట జంక్షన్ లోని లాన్సమ్ స్క్వేర్ భవనంలో ఐబీఎం సంస్థ ఏర్పాటుచేసిన ఫ్యూచర్నౌ సెంటర్ను ఐబీఎం ఇండియా, సౌత్ ఏసియా మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ పటేల్ తో కలిసి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఐ గవర్నెన్స్ ఇంటెలిజెన్స్,

...మిగతా 2లో

## పొగాకు రైతుల సంక్షేమంపై జగన్మోహన్‌రెడ్డికి బహిరంగ సవాల్

వాస్తవాలు, గణాంకాలతో చర్చకు సిద్ధమా జగన్? రైతుల కోసం చేసింది ఎవరు? మాటలు చెప్పింది ఎవరు? ప్రజల ముందే తేల్చుకుందాం: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**అమరావతి, ఆగస్టు 05,(మనం ప్రత్యేక ప్రతినిధి):** పొగాకు రైతుల సంక్షేమంపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవాలపై ఆధారపడినవని, రైతులపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే వాస్తవాలు, గణాంకాలతో బహిరంగ చర్చకు రావాలని

...మిగతా 2లో

## పులిని హతమార్చిన ఘటన అమానుషం.. నిందితులకు కఠిన శిక్ష విధించాలి

● బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి

**మార్కాపురం,ఆగస్టు,05,(మనం న్యూస్):** మార్కాపురం జిల్లా రాచర్ల మండలం జె. పుల్లలచెరు అటవీ ప్రాంతంలో పులిని వేటాడి హతమార్చిన ఘటనను బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి తీవ్రంగా ఖండించారు. దేశంలో అంతరించిపోతున్న వన్యప్రాణుల్లో అత్యంత కీలకమైన పులిని నాటు తుపాకీతో కాల్చి చంపడమే కాకుండా, దాని కాళ్లు, గోళ్లను నరికివేసి కళేబరాన్ని అడవిలో పడేయడం అత్యంత అమానుషమైన, దారుణమైన చర్య అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ, ప్రాజెక్ట్ టైగర్ అధికారులు వేగంగా స్పందించి, శాస్త్రీయ ఆధారాలు, డాగ్ స్క్వాడ్, సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో

...మిగతా 2లో

## ఆర్&బీ శాఖ పురోగతిపై క్షేత్రస్థాయి అధికారులతో మంత్రి జనార్ధన్ రెడ్డి సమీక్ష

రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న రహదారి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆదేశం

రూ.2,500 కోట్లతో చేపట్టిన 6,061 కి.మీ రహదారి పనుల్లో వేగవంతం చేయాలని సూచించిన మంత్రి

పనులు వేగంగా పూర్తి చేసే కాంట్రాక్టర్లకు బిల్లులను త్వరితగతిన చెల్లిస్తామని మంత్రి హామీ

**అమరావతి, ఆగస్టు,05,(మనం ప్రతినిధి):** రాష్ట్రంలో రూ.72,688 కోట్ల విలువైన జాతీయ రహదారి ప్రాజెక్టులకు భూసేకరణను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం. ఆర్ బీ శాఖ అభివృద్ధి పనులను ప్రజలకు చేరవేసేందుకు అధికారిక యూట్యూబ్ ఛానల్ ప్రారంభించిన మంత్రి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో గతంలో ఎప్పుడూ లేనివిధంగా రహదారుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న క్రమంలో క్షేత్రస్థాయి అధికారులు మరింత కష్టపడి పనిచేయాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో రహదారుల అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు

...మిగతా 2లో

## రోజుకు 3 గంటలే నిద్రపోత

ప్రతిపక్ష సభ్యుల నుంచి కూడా నేర్చుకోవాలె

రాజ్యసభలో ఎన్డీయే నూతన ఎంపీలతో ప్రధాని మోడీ

**ఢిల్లీ, ఆగష్టు 5:** రాజ్యసభకు కొత్తగా ఎన్నికైన ఎన్డీయే ఎంపీలకు ప్రధాని పలు రాజకీయ, పార్లమెంటరీ అంశాలపై కీలక సూచనలు చేశారు. బుధవారం అల్పాహారం సందర్భంగా వారితో మోడీ దాదాపు గంట పాటు భేటీ అయ్యారు. జూన్ లో జరిగిన రాజ్యసభ ఎన్నికల తర్వాత తొలిసారిగా పార్లమెంటులో అడుగుపెట్టిన ఎంపీలలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కూడా ఉన్నారు. వ్యక్తిగత ప్రవర్తన సహా రాజ్యసభలో ప్రతిపక్షాలతో ఎలా వ్యవహరించాలనే

...మిగతా 2లో

## చేనేత వస్త్రాల వినియోగాన్ని పెంపొందించడం మన లక్ష్యం

2

## 'చట్టం'తో బీసీలకు రక్షణ

దేశంలోనే మొట్టమొదటిసారిగా బీసీ రక్షణ చట్టం తీసుకొస్తున్న ఏపీ: సవిత

జాతీయ బీసీ కమిషన్ సూచనలతో చట్టాన్ని అసెంబ్లీలో ఆమోదిస్తాం

5 ఏళ్ల పాటు బీసీలను వేధించిన గత పాలకులు: మంత్రి అచెన్నాయుడు

స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్ల పెంపునకు కృషి

విజయవాడలో మంత్రి సవిత నేతృత్వంలో బీసీ రక్షణ చట్టంపై కీలక భేటీ

పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు

4

## సారీ... మోడీ జీ

● క్షమాపణ చెప్పిన మార్క్ జుకర్ బర్గ్

● ప్రధాని 'జెన్ జీ అవుట్‌రీచ్' వీడియో తొలగింపుపై మెటా ప్రతినిధులను నిలదీసిన ఐటీ శాఖ

**ఢిల్లీ, ఆగష్టు 5:** మెటా సీఈవో మార్క్ జుకర్ బర్గ్ బుధవారం క్షమాపణ చెప్పారు. డీప్ ఫేక్ కంటెంట్ వ్యాప్తి, చైల్డ్ సెక్సువల్ అబ్యూజ్ కంటెంట్, ప్లాట్ ఫామ్ నిర్వహణలో పొరపాట్లను అంగీకరిస్తూ ఆయన క్షమాపణ చెప్పారు. దీనికన్నా ముందు మెటా ప్రతినిధులు.. కేంద్ర ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఐటీ శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశానికి మెటా తరపున చీఫ్ గ్లోబల్ అఫైర్స్

...మిగతా 2లో

## వధువుకు 8 గ్రా. బంగారం, పట్టు చీర.. విద్యార్థులకు ల్యాప్ టాప్‌లు, సైకిళ్లు

● ఐదు లక్షల మందికి ఏఐలో శిక్షణ

● తమిళనాడులో తొలి బడ్జెట్ ప్రవేశపెట్టిన విజయ్ సారథ్యంలోని టీవీకే ప్రభుత్వం

2

### డీలిమిటేషన్, మహిళా బిల్లులపై..

## 16 నుంచి పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు!

● రాహుల్‌తో రిజిజు సమావేశం

2

## అత్యంత ఆకర్షణీయమైన కంపెనీగా గూగుల్

**ఢిల్లీ, ఆగష్టు 5:** దేశంలోనే అత్యంత ఆకర్షణీయమైన ఎంప్లాయర్ బ్రాండ్ గా గూగుల్ అవతరించింది. రెండో స్థానంలో టాటా గ్రూప్, అమెజాన్ నిలిచాయి. ఈ మేరకు హెచ్ఆర్ సేవల సంస్థ రాండ్స్టాడ్ ఎంప్లాయర్ బ్రాండ్ రీసెర్చ్ -2026 నివేదిక వెల్లడించింది. వర్క్-లైఫ్ బ్యాలెన్స్, సమానత్వం, ఆకర్షణీయ వేతనం వంటి ఇతర ప్రయోజనాలను భారతీయ ఉద్యోగులు పరిగణనలోకి తీసుకుంటున్నట్లు పేర్కొంది. ఆర్ఈబీఆర్-26 జాబితా ప్రకారం..

...మిగతా 2లో

## అమెరికాలోని ఆ రాష్ట్రంలో.. ఆగస్టు 15న ఇండియా డే

**మసాచుసెట్స్, ఆగష్టు 5:** భారత్‌కు స్వాతంత్ర్యం లభించిన 'ఆగస్టు 15'వ తేదీకి అమెరికాలో ప్రత్యేక గుర్తింపు లభించింది. ఆ రోజును 'ఇండియా డే'గా మసాచుసెట్స్ ప్రకటించింది. తమ రాష్ట్రానికి భారత సంతతి ప్రజలు అందించిన సేవలకు గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు గవర్నర్ మౌరా హీలీ వెల్లడించారు. ఈ సందర్భంగా నిర్వహించే కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ''భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. విభిన్న జాతులు, మతాలు, భాషలు, ఆచారాలు అక్కడ ఉన్నాయి. ఇన్ని వ్యత్యాసాలు ఉన్నప్పటికీ భారతీయులందరిలో ఐక్యత కనిపిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో 3.6 కోట్ల మంది భారతీయ మూలాలున్న ప్రజలు నివసిస్తున్నారు. అమెరికాలోనే 50 లక్షలకు పైగా భారత సంతతి ప్రజలు ఉన్నారు. సామాజిక, పౌర, ఆర్థిక రంగాల్లో అమెరికాకు వీరు విశేష సేవలు అందిస్తున్నారు. వైద్యం, విజ్ఞానం, సాంకేతికత, విద్య, వ్యాపారం, ప్రజాసేవలో కీలక పాత్ర పోషిస్తున్నారు'' అని మసాచుసెట్స్ గవర్నర్ పేర్కొన్నారు.

### 20 నిమిషాల్లో 7 పేలుళ్లు..

## దద్దరిల్లిన దుబాయ్

**అబుదాభి, ఆగష్టు 5:** వరుస పేలుళ్లతో దుబాయ్ దద్దరిల్లింది. జెబెల్ అలీ పారిశ్రామిక ప్రాంతంలో మంగళవారం రాత్రి భారీ పేలుళ్లు చోటుచేసుకున్నాయి. కేవలం 20 నిమిషాల్లోనే 7 భారీ పేలుడు శబ్దాలు వినిపించినట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. దీంతో ప్రజలు ఉలిక్కిపడ్డారు. పేలుళ్ల కారణంగా పరిసర ప్రాంతాల్లో దట్టమైన పొగలు అలుముకున్నాయి. ఈ పారిశ్రామిక ప్రాంతం

...మిగతా 2లో

## భారత్‌కు దూరమవ్వాలని అనుకోవట్లేదు

హసీనా ప్రెస్‌మీట్ వేళ బంగ్లాదేశ్

**ఢిల్లీ, ఆగష్టు 5:** భారత్‌లో ఆశ్రయం పొందుతున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా త్వరలోనే స్వదేశానికి తిరిగెళ్లే యోచనలో ఉన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే పలుమార్లు సూచనప్రాయంగా వెల్లడించిన ఆమె తాజాగా మీడియా ముందుకు వచ్చేందుకు సిద్ధమయ్యారు. ఢిల్లీలో పత్రికా విలేకరులను ఉద్దేశించి బుధవారం ఆమె ప్రసంగించనున్నారు. దీనిపై బంగ్లాదేశ్ ప్రభుత్వం స్పందించింది. పొరుగు దేశం భారత్‌తో ఉన్న స్నేహపూర్వక సంబంధాలు చెడిపోవాలని తాము

...మిగతా 2లో

# సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సెలెన్స్‌కు లోకేష్ శంకుస్థాపన

(మొదటి పేజీ తరువాయి)

నిర్మిస్తున్న ఈ అకాడమీ కేవలం బ్యాడ్మింటన్కే పరిమితం కాకుండా మొత్తం ఏడు ప్రధాన క్రీడా విభాగాల్లో అంతర్జాతీయ స్థాయి శిక్షణను అందించనుంది. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, విశాఖను దేశంలోనే అత్యుత్తమ క్రీడా హబ్గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని, ఈ అకాడమీ ద్వారా వందలాది మంది 'పీవీ సింధు'లు తయారవ్వాలని ఆకాంక్షించారు.

క్రీడాకారులకు , పీవీ సింధు ఆశయాలకు అండగా ఉంటామని స్పష్టం చేస్తూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచస్థాయిలో దేశ ప్రతిష్టను నిలిపిన పీవీ సింధు లాంటి క్రీడాకారులు విశాఖపట్నం మట్టి నుండి మరో వంద మంది తయారుకావాలని, దానికి ఈ అకాడమీ సరైన వేదిక అవుతుందని లోకేశ్ పేర్కొన్నారు. ఎలాంటి వసతులు లేని రోజుల్లోనే కేవలం పట్టుదల, క్రమశిక్షణ, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో సింధు ఒలింపిక్ పతకాలు సాధించి అంతర్జాతీయ ఛాంపియన్గా ఎదిగారని కొనియాడారు. 90వ దశకంలోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు క్రీడల ప్రాధాన్యతను గుర్తించారని, ప్రభుత్వ ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటాను ప్రవేశపెట్టి ఏపీలో క్రీడా విప్లవానికి నాంది పలికారని గుర్తుచేశారు. పీవీ సింధు అకాడమీ గడువులోగా (మే 2028 నాటికి) పూర్తి కావడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజల మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్పొరేట్ సంస్థలు సైతం సీఎస్ఆర్ నిధుల ద్వారా ఈ ప్రాజెక్టో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

పీవీ సింధు తన ప్రసంగంలో రాబోయే 100 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ అకాడమీని డిజైన్ చేస్తున్నట్లు వెల్లడించారు. బ్యాడ్మింటన్తో పాటు మొత్తం 7 ప్రధాన క్రీడలకు అంతర్జాతీయ కోచ్లతో ఇక్కడ శిక్షణ ఇస్తారు. ఇటలీకి చెందిన ప్రముఖ 'మిర్తా పూల్స్' ప్రమాణాలతో కూడిన 25 మీటర్ల స్విమ్మింగ్ పూల్, అలాగే 25 మీటర్ల ఇండోర్ షూటింగ్ రేంజ్ ఇక్కడ అందుబాటులోకి రానున్నాయి.అత్యాధునిక వసతులు: స్పోర్ట్స్ సైన్స్, ఫిజియోథెరపీ, బయోమెకానికల్ అనాలిసిస్ కెమెరాలు మరియు గ్రామీణ ప్రతిభావంతులైన క్రీడాకారుల కోసం వసతి సౌకర్యాలు కూడా కల్పిస్తున్నారు.ఈ కార్యక్రమంలో ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు పీవీ సింధు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# చికిత్స పేరుతో చంపేసిండ్రు

**లఖ్ నవూ, ఆగష్టు 5:** చికిత్స, మత విశ్వాసం పేరుతో 10రోజుల పాటు ఓ మహిళను స్తంభానికి కట్టేయడంతో ఆమె ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటన ఉత్తర్ప్రదేశ్ లోని బారాబంకి జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లఖ్ నవూలోని గోమతీనగర్కు చెందిన మహిళ (33) ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. అయితే కుటుంబసభ్యులు ఆమెను ఆసుపత్రికి తీసుకువెళ్లడానికి బదులు బాబా దగ్గరకు తీసుకువెళ్లారు. ఆమెను దుష్టశక్తులు ఆవహించాయని.. సమస్యను నయం చేస్తానని ఆయన చెప్పారు. పది రోజుల పాటు స్తంభానికి ఆమెను కట్టేశారు. నాటి నుంచి చికిత్స పేరుతో అక్కడ పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

పది రోజుల పాటు ఆహారం లేకపోవడంతో.. సోమవారం మహిళ ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది. దీంతో ఆమెను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు వెల్లడించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ఆమె భర్తతో పాటు బాబా, అతడి సహచరుడిని అరెస్ట్ చేశారు.

# రోజుకు 3 గంటలే నిద్రపోత

(మొదటి పేజీ తరువాయి)

అంశాలపై వారికి మోడీ దిశానిర్దేశం చేశారు. వీలైనంత వరకు సభకే ఎక్కువ సమయం కేటాయించాలని.. 100 శాతం అటెండెన్స్ ఉండేలా చూసుకోవాలని తెలిపారు. సొంత పార్టీ నేతల నుంచే కాకుండా ప్రతిపక్ష ఎంపీల నుంచి కూడా మంచి విషయాలను నేర్చుకోవాలని హితవు పలికా తన వ్యక్తిగత దినచర్య గురించి ఎంపీల ప్రశ్నలకు స్పందించిన మోడీ.. తాను నిద్రకు ఉపక్రమిస్తే ఎనిమిది సెకన్లలోపే నిద్ర పట్టేస్తుందన్నారు. రోజుకు కేవలం మూడు గంటలు మాత్రమే నిద్రపోతానని తెలిపారు. జీవితంలో ఉత్తమ ఫలితాలు సాధించాలంటే వర్తమానంలో జీవించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విదేశీ పర్యటనల గురించి మాట్లాడుతూ.. విమానం ఎక్కిన వెంటనే తాను వెళ్తున్న దేశం కాలమానానికి తగ్గట్టుగా గడియారంలో సమయాన్ని సర్దుబాటు చేసుకుంటానని తెలిపారు. దానివల్ల ఏ దేశానికి వెళ్లినా ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు.

## పొగాకు రైతుల సంక్షేమంపై జగన్మోహన్రెడ్డికి బహిరంగ సవాల్

(మొదటి పేజీ తరువాయి)

జగన్మోహన్రెడ్డికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు బహిరంగ సవాల్ విసిరారు. బుధవారం విజయవాడలోని ఓ ప్రైవేట్ హోటల్ లో మీడియాతో మాట్లాడుతూ జగన్మోహన్రెడ్డి గారూ... మీరు పొగాకు రైతుల కష్టాల గురించి మాట్లాడుతున్నారు, కానీ వాస్తవాలు, గణాంకాలతో బహిరంగ చర్చకు రావడం లేదు. రైతులపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే ఈ సవాలును స్వీకరించండి. పొగాకు రైతులు సంక్షోభంలో ఉన్న ప్రతిసారీ వారిని ఆదుకున్నది టీడీపీ నాయకత్వంలోని ప్రభుత్వమే. రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రతిసారీ అండగా నిలిచి నిర్ణయాలు తీసుకున్న చరిత్ర టీడీపీ ప్రభుత్వానిదే. గత సంవత్సరం బర్లీ పొగాకు రైతుల నుంచి 25 మిలియన్ కిలోల పొగాకును కొనుగోలు చేసి, సుమారు రూ.280 కోట్లు వెచ్చించడం జరిగింది.2014-15లో ఎఫ్పీవీ పొగాకు ధరలు పడిపోయినప్పుడు, వాణిజ్య పంట అయినప్పటికీ రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో ప్రతి కిలోకు రూ.20 ఆర్థిక సహాయం అందించడం జరిగింది. చరిత్రలోనే ఇది ఒక కీలక నిర్ణయం. అయితే, మీ ప్రభుత్వ హయాంలో 2019లో సుమారు 124 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తి కాగా, ధర కిలోకు రూ.121-123కు పడిపోయింది. అయినప్పటికీ మీ ప్రభుత్వం కేవలం 11.8 మిలియన్ కిలోలను మాత్రమే కొనుగోలు చేసి, మిగిలిన రైతులను గాలికి వదిలేసింది. తదుపరి సంవత్సరం సుమారు 128 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తి అయి, ధర కిలోకు రూ.123కు పడిపోయినప్పటికీ, మీ ప్రభుత్వం ఒక్క కిలో కూడా కొనుగోలు చేయలేదు. రైతులకు ఎలాంటి అదనపు ఆర్థిక సహాయమూ అందించలేదు.

# ఐబీఎం ఫ్యూచర్ నౌ సెంటర్

(మొదటి పేజీ తరువాయి)

కెమికల్స్ అండ్ పెట్రోలియం ఇండస్ట్రీ ఆపరేషన్స్ గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా కన్సల్టింగ్ సేవలు, ఏఐ ఫస్ట్ ట్రాన్స్ ఫర్మేషన్ ప్రాజెక్టులకు మద్దతుగా ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్నౌ సెంటర్ ను ఏర్పాటుచేయడం జరిగింది. భారతదేశ సాంకేతిక ఆవిష్కరణలు, ప్రతిభావంతులైన మానవ వనరుల అభివృద్ధిపై సంస్థ కొనసాగిస్తున్న పెట్టుబడులకు ఇది మరో కీలక ముందడుగు కానుంది. ఈ సెంటర్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఖాతాదారులకు కన్సల్టింగ్, సాంకేతిక సేవలను అందించనుంది. ఇందులో కృత్రిమ మేధస్సు (ఏఐ), హైబ్రిడ్ క్లౌడ్, సాఫ్ట్వేర్ ఇంజనీరింగ్, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, ఎంటర్ప్రైజ్ ట్రాన్స్ఫార్మేషన్ వంటి కీలక రంగాల్లో సేవలు అందించనున్నారు. అదేవిధంగా ఏఐ ఆధారిత క్లౌడ్ ట్రాన్స్ఫార్మేషన్, ప్లాట్ఫార్మ్ ఇంజనీరింగ్, సర్వీస్ ఇంటిగ్రేషన్, క్వాలిటీ ఇంజనీరింగ్, యూజర్ ఎక్స్పీరియన్స్ సేవలకు ఇది ప్రధాన కేంద్రంగా పనిచేయనుంది.

### ఫ్యూచర్ రెడీ టెక్నాలజీ వర్క్ ఫోర్స్ అభివృద్ధే లక్ష్యం

భారతదేశంలోని అభివృద్ధి చెందుతున్న సాంకేతిక కేంద్రాల్లో ఆవిష్కరణలు, సేవల సామర్థ్యాలను విస్తరించాలన్న ఐబీఎం లక్ష్యానికి ఈ ఫ్యూచర్నౌ సెంటర్ ప్రతీకగా నిలుస్తోంది. విస్తృత సాంకేతిక ప్రతిభ, బలమైన విద్యాసంస్థలు, వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పర్యావరణ వ్యవస్థతో విశాఖపట్నం ప్రపంచ ఖాతాదారుల అవసరాలను తీర్చేందుకు అనువైన కేంద్రంగా ఎదుగుతోంది. ఈ సెంటర్ ద్వారా ఆంధ్రప్రదేశ్లో ఐబీఎం తన కార్యకలాపాలను మరింత బలోపేతం చేయడంతో పాటు, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన సాంకేతిక నైపుణ్యాలున్న మానవ వనరుల అభివృద్ధికి తోడ్పడాలని లక్ష్యంగా పెట్టుకుంది.

### ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో భాగస్వామ్యం కావాలి

ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ సేవలు, సాంకేతికత ఆధారిత ఆవిష్కరణలకు ప్రపంచ కేంద్రంగా విశాఖపట్నం ఆవిర్భవించడాన్ని ఐబీఎం ఫ్యూచర్నౌ సెంటర్ తోడ్పాటునందిస్తోంది. మా లక్ష్యం, కేవలం సాంకేతిక పెట్టుబడులను ఆకర్షించడం మాత్రమే కాదు, నాణ్యమైన ఉపాధిని సృష్టించడం, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న ప్రతిభను అభివృద్ధి చేయడం, ఆంధ్రప్రదేశ్ యువత ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో భాగమయ్యేలా చేసే ఒక సంపూర్ణ పర్యావరణ వ్యవస్థను నిర్మించడమే మా లక్ష్యం. ఆంధ్రప్రదేశ్ పట్ల ఐబీఎం చూపుతున్న నిరంతర నిబద్ధతను మేం స్వాగతిస్తున్నాం. ఏఐ, డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ కోసం విశాఖపట్నాన్ని భారతదేశంలోని అగ్రగామి కేంద్రాలలో ఒకటిగా తీర్చిదిద్దడానికి ఐబీఎంతో కలిసి పనిచేయడానికిఎదురుచూస్తున్నామని అన్నారు. ఐబీఎం ఇండియా, సౌత్ ఏసియా మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ పటేల్ మాట్లాడుతూ... వికసిత్ భారత్-2047 లక్ష్య సాధనలో భారతదేశానికి డిజిటల్ యుగంలో ప్రపంచానికి నాయకత్వం వహించే అపూర్వ అవకాశం ఉంది. ప్రతిభ, ఆవిష్కరణలు, సాంకేతిక సామర్థ్యాలను సమన్వయం చేసుకుంటూ ఈ లక్ష్యాన్ని సాధించవచ్చు. ఐబీఎంలో మేం, మా ఖాతాదారులు ఏఐతో పాటు ఇతర అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను అందిపుచ్చుకుని, దీర్ఘకాలిక విలువను సృష్టించేందుకు అవసరమైన సామర్థ్యాలను నిర్మించడానికి కట్టుబడి ఉన్నాం. విశాఖపట్నంలోని ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్నౌ సెంటర్ ఏర్పాటు ఇందుకు నిదర్శనం. అలాగే ప్రపంచస్థాయి ఆవిష్కరణలు, సాంకేతిక సేవల కేంద్రంగా భారతదేశ స్థాయిని మరింత బలోపేతం చేస్తుందని అన్నారు.ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్నౌ సెంటర్ ఇండియా మేనేజింగ్ పార్టనర్ ఉషా శ్రీకాంత్ మాట్లాడుతూ.. విశాఖపట్నంలో అభివృద్ధి చెందుతున్న సాంకేతిక ప్రతిభ, బలమైన విద్యాసంస్థలు, టెక్నాలజీ ఎకోసిస్టమ్ వల్ల ప్రపంచ ఖాతాదారుల డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ అవసరాలకు మద్దతు ఇచ్చే కీలక కేంద్రంగా మారుతోంది. ఐబీఎం ఫ్యూచర్నౌ సెంటర్ ద్వారా అత్యాధునిక సాంకేతిక నైపుణ్యాలను స్థానిక ప్రతిభతో సమన్వయం చేస్తాం. ఏఐ, డిజిటల్ ట్రాన్స్ఫార్మేషన్ను వేగవంతం చేయడంతో పాటు, స్థానిక యువతకు మరింత మెరుగైన ఉపాధి అవకాశాలను సృష్టించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు.

# సారీ... మోడీ జీ

(మొదటి పేజీ తరువాయి)

ఆఫీసర్ జోయెల్ కాపన్ తో పాటు పలువురు అధికారులు హాజరయ్యారు. సుమారు 45 నిమిషాల పాటు సాగిన ఈ సమావేశంలో ప్రధాని మోడీ 'జెన్ జీ అవుట్ రీచ్' వీడియో తొలగింపునకు గల కారణాలపై నిలదీసినట్లు తెలిసింది. అలాగే అభ్యంతరకర కంటెంట్ నియంత్రణలో మెటా వ్యవహరిస్తున్న తీరుపైనా వివరణ కోరినట్లు సమాచారం. ఈ సమావేశమైన కొద్ది సేపటికే మెటా అధినేత నుంచి క్షమాపణ ప్రకటన వచ్చింది.

## 20నిమిషాల్లో 7పేలుళ్లు.. దద్దరిల్లిన దుబాయ్

(మొదటి పేజీ తరువాయి)

పక్కనే ప్రపంచంలోనే అతిపెద్ద నౌకాశ్రయం ఉంది. పేలుళ్ల అనంతరం దుబాయ్లోని ఓడరేవుకు ఆనుకుని ఉన్న ఇంధన నిల్వ, రవాణా కోసం ఉపయోగించే ఒక గిడ్డంగిలో మంటలు చెలరేగినట్లు ఉపగ్రహ చిత్రాలు చూపిస్తున్నాయి. ఈ ఘటనలో ప్రాణ, ఆస్తి నష్టాలకు సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది. పేలుళ్ల వెనక హూతీల హస్తం ఉందని ఇరాన్ అధికారిక మీడియా వెల్లడించింది. యెమెన్ నుంచి ఈ క్షిపణి దాడులు జరిగినట్లు ఇరాక్ ఆరోపించింది. కాగా ఈ పేలుళ్లపై యూఏఈ అధికారిక ప్రకటన చేయలేదు.

## భారత్‌కు దూరమవ్వాలని అనుకోవట్లేదు

(మొదటి పేజీ తరువాయి)

కోరుకోవట్లేదని బంగ్లా విదేశాంగశాఖ సహాయ మంత్రి షామా ఒబేద్ పేర్కొన్నారు. ఈ విషయాన్ని భారత్ అర్థం చేసుకుంటుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. పొరుగు దేశం నుంచి హసీనా సహా ఇతర అవామీ లీగ్ నాయకులు రాజకీయ ప్రకటనలు చేయడంపై తమ ఆందోళనలను ఇప్పటికే పలుమార్లు భారత్‌కు తెలియజేశామని షామా వెల్లడించారు. హసీనా మీడియా సమావేశంతో తమకు ఎలాంటి సంబంధం లేదని భారత్ స్పష్టం చేసిన విషయాన్ని ప్రస్తావించారు. మరోవైపు హసీనా ప్రసంగాలు, ప్రకటనలు, ఇంటర్వ్యూలు, ఆడియో/వీడియో సందేశాలను ప్రచురించడం/ప్రసారం చేయడాన్ని నిషేధిస్తున్నట్లు బంగ్లాదేశ్ ప్రభుత్వం వెల్లడించింది. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తమ దేశంలోని మీడియా సంస్థలను హెచ్చరించింది.

**ఏమి మాట్లాడనున్నారు..?**

బంగ్లాలో విద్యార్థుల తిరుగుబాటు ఫలితంగా అధికారాన్ని కోల్పోయి భారత్‌కు పారిపోయి వచ్చిన అనంతరం హసీనా విలేకరులను ఉద్దేశించి మాట్లాడటం ఇదే తొలిసారి. ఈ సమావేశంలో ఆమె వర్చువల్ పద్ధతిలో పాల్గొంటారు. ఇందులో ఆమె బంగ్లాదేశ్‌కు ఎప్పుడు వెళ్తారనే విషయంతో పాటు భవిష్యత్ ప్రణాళికలను ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమంలో హసీనా కుమారుడు సాజీబ్ వాజెద్, ఇతర అవామీ లీగ్ నేతలు పాల్గొనే అవకాశం ఉంది. అయితే, ఈ సమావేశంతో తమకెలాంటి సంబంధం లేదని భారత విదేశాంగశాఖ స్పష్టం చేసింది. దీనిని ఒక ప్రైవేటు మీడియా సంస్థ ఏర్పాటు చేస్తోందని వెల్లడించింది.

# రూ.9.50 లక్షల కోట్ల పెట్టుబడులతో.. విశాఖ ఎకనామిక్ రీజియన్

(మొదటి పేజీ తరువాయి)

దిశానిర్దేశం చేశారు. వివిధ ప్రాజెక్టులను పరస్పరం అనుసంధానించడం ద్వారానే రీజియన్ వేగంగా ప్రగతి సాధిస్తుందని సీఎం పేర్కొన్నారు. మూలపేట పోర్టు నుండి రాజమండ్రి వరకు ఈస్ట్-వెస్ట్ కనెక్టివిటీని బలోపేతం చేయాలని, పారిశ్రామిక రంగానికి అవసరమైన మౌలిక వసతులను వేగంగా కల్పించాలని సూచించారు. ఈ రీజియన్కు 'బేసిటీ' ప్రాజెక్టును ఒక యాంకర్ ప్రాజెక్టుగా మలిచి, అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తోంది. తీరప్రాంత పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తూనే, ఐటీ, ఏఐ డేటా సెంటర్లు, క్లీన్ ఎనర్జీ వంటి భవిష్యత్తు రంగాలకు విశాఖను కేరాఫ్ అడ్రస్గా మార్చాలని సీఎం స్పష్టం చేశారు.ఈ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్తో పాటు ఆర్థిక, పరిశ్రమలు, పురపాలక, అటవీ, ఇంధన, పర్యాటక శాఖలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పులిని హతమార్చిన ఘటన అమానుషం.. నిందితులకు కఠిన శిక్ష విధించాలి

(మొదటి పేజీ తరువాయి)

సమగ్ర విచారణ చేపట్టి, ఏడుగురు నిందితులను అరెస్ట్ చేయడం అభినందనీయమని అన్నారు. నిందితుల వద్ద నుంచి పులికి చెందిన పంజాలు, ఎముకలు, దేశీయ తుపాకీ, గొడ్డలిని స్వాధీనం చేసుకోవడం దర్యాప్తులో అధికారుల సమర్థతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కేసు ఛేదనలో గిద్దలూరు ప్రాజెక్ట్ టైగర్ అధికారులు, అటవీ సిబ్బంది, పశువైద్య బృందం, హనుమాన్ ప్రత్యేక బృందం, అలాగే మార్కాపురం జిల్లా పోలీసు యంత్రాంగం సమన్వయంతో పనిచేసి నిందితులను చట్టం ముందుకు తీసుకురావడం అభినందించాల్సిన విషయమన్నారు. వన్యప్రాణుల సంరక్షణలో అటవీ శాఖ తీసుకుంటున్న చర్యలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో పులులు కీలక పాత్ర పోషిస్తాయని, వాటి సంరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి అన్నారు. అక్రమ వేట, వన్యప్రాణుల అవయవాల అక్రమ రవాణా వంటి నేరాలకు పాల్పడేవారిపై అత్యంత కఠినమైన చర్యలు తీసుకుని, చట్టప్రకారం గరిష్ట శిక్షలు విధించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశంలో పులుల సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ ప్రాజెక్ట్ టైగర్ వంటి కార్యక్రమాలను మరింత బలోపేతం చేస్తోందని, ఈ నేపథ్యంలో వన్యప్రాణులపై దాడులు చేసే వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకూడదని అన్నారు. ప్రకృతి సంపద, జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం, అటవీ శాఖ, ప్రజలు కలిసి పనిచేస్తేనే భావితరాలకు సమృద్ధమైన పర్యావరణాన్ని అందించగలమని డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు.

# ఆర్-బీ శాఖ పురోగతిపై క్షేత్రస్థాయి అధికారులతో మంత్రి జనార్థన్ రెడ్డి సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

పెండింగ్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి సూచించారు. విజయవాడలోని ఆర్ బీ శాఖ ఈఎన్సీ కార్యాలయంలో ఈఎన్సీలు రామచంద్ర, శేషు కుమార్, చీఫ్ ఇంజినీర్లు విజయ , నవీన్, బుచ్చిరాజు, ఎస్ఈలు, ఈఈలు మరియు ఆ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి శాఖ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ బీ శాఖ అధికారిక యూట్యూబ్ ఛానల్ ను మంత్రి ప్రారంభించారు. ఆర్ బీ శాఖ అధికారులు కష్టపడి పనిచేయడం వల్లే ప్రజలు సురక్షితంగా, సౌకర్యవంతంగా రహదారులపై ప్రయాణిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. శాఖ అధికారులు చేస్తున్న సేవలను ప్రజలకు తెలియజేయడంతో పాటు రాష్ట్రంలో చేపడుతున్న రహదారి అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించేందుకు ఈ యూట్యూబ్ ఛానల్ ఉపయోగపడుతుందని తెలిపారు.రాష్ట్రంలో మొత్తం 45,433 కిలోమీటర్ల ఆర్ బీ రహదారులు ఉండగా, వాటిలో 10,238 కిలోమీటర్ల రహదారుల అభివృద్ధి చేపట్టాల్సి ఉందని మంత్రి వెల్లడించారు. వార్షిక నిర్వహణ కార్యక్రమంలో భాగంగా 22,602 కిలోమీటర్ల గుంతల రహిత రహదారుల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

రూ.2,500 కోట్ల వ్యయంతో చేపట్టిన 6,061 కిలోమీటర్ల రహదారుల అభివృద్ధి పనుల్లో ఇప్పటివరకు 53 శాతం మాత్రమే పూర్తయ్యాయని అధికారులు వివరించారు. రహదారుల అభివృద్ధిలో వెనుకబడిన జిల్లాల్లో పనులను మరింత వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. అలాగే రూ.514 కోట్లతో చేపట్టిన పనుల్లో తీవ్ర జాప్యం నెలకొన్నందున ఆయా జిల్లాల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పురోగతి సాధించాలని ఆదేశించారు. బిటుమన్ సరఫరాలో కొరత కారణంగా పనులు ఆలస్యమవుతున్నాయని అధికారులు వివరించగా, బిటుమన్ ధరల పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని కాంట్రాక్టర్లకు ధరల సవరణకు ముఖ్యమంత్రి వెసులుబాటు కల్పించారని మంత్రి తెలిపారు. ఈ సౌకర్యాన్ని రూ.40 లక్షల విలువైన పనులకు కూడా విస్తరించామని, ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని స్పష్టం చేశారు. గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం రూ.8,530 కోట్ల నిధులు మంజూరు చేయగా, ఇప్పటికే రూ.4,110 కోట్ల బిల్లులు చెల్లించామని మంత్రి తెలిపారు.

నెలవారీ లక్ష్యాలను నిర్దేశించుకుని పెండింగ్ పనులను పూర్తి చేయాలని, పనులు వేగంగా పూర్తిచేస్తే బిల్లులను కూడా త్వరితగతిన చెల్లిస్తామని అధికారులకు హామీ ఇచ్చారు.రహదారుల అభివృద్ధిలో వెనుకబడిన జిల్లాలను వచ్చే నెలలో స్వయంగా సందర్శిస్తానని, అప్పటికి గణనీయమైన పురోగతి కనిపించాలని మంత్రి స్పష్టం చేశారు.

పీపీపీ విధానంలో చేపట్టనున్న 11 ప్రాజెక్టుల్లో తొలి దశలో 6 ప్రాజెక్టులకు భూసేకరణ, యుటిలిటీ షిఫ్టింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు.

## అత్యంత ఆకర్షణీయమైన కంపెనీగా గూగుల్

(మొదటి పేజీ తరువాయి)

శాంసంగ్ ఇండియా 4, ఇన్ఫోసిస్ 5, రిలయన్స్ ఇండస్ట్రీస్ 6, ఐటీసీ గ్రూప్ 7, హిందూస్థాన్ యునిలీవర్ 8, మహీంద్రా అండ్ మహీంద్రా 9, డెల్ టెక్నాలజీస్ లిమిటెడ్ 10వ స్థానాలను ఆక్రమించాయి. ప్రపంచవ్యాప్తంగా 34 మార్కెట్లు కవర్ చేస్తూ.. దాదాపు 1.75 లక్షల మందిపై ర్యాండ్డ్వాడ్ ఈ సర్వే నిర్వహించింది. భారత్ నుంచి 3,500 మందికిపైగా సర్వేలో పాల్గొన్నారు. ఇందులో 46 శాతం మంది ఆరునెలల్లో ఉద్యోగాలు మారనున్నారు.

# 16 నుంచి పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు!

**ఢిల్లీ, ఆగష్టు 5:** ప్రస్తుతం కొనసాగుతున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఆగస్టు 13న ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లుల ఆమోదం కోసం ఆగస్టు 16 నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని కేంద్రం భావిస్తున్నట్లు సమాచారం.

ప్రతిపాదిత సవరణలు ఆమోదం పొందేందుకు అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీని సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. అవసరమైన సంఖ్యా బలం సమకూరిన తర్వాత ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉందని తెలిపాయి. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రతిష్టంభన కొనసాగుతోంది. బుధవారం ప్రతిపక్షాల నినాదాల మధ్య లోక్ సభ ప్రారంభమైన కొన్ని నిమిషాలకే వాయిదా పడింది. దీంతో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ఆయన




ఛాంబర్లో కలిశారు. డీలిమిటేషన్ బిల్లు, మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లులకు సహకరించాలని కోరారు. అయితే, కేంద్రమంత్రి అభ్యర్థనను కాంగ్రెస్ ఎంపీ తిరస్కరించారు. అయోధ్య రామ మందిరంలో విరాళాల చోరీ, సీజేపీ నిరసనల్లో విద్యార్థులపై పోలీసుల దుశ్చర్యలపై హోంమంత్రి అమిత్ షా ప్రకటన వెలువడే వరకు సభలో ఎలాంటి కార్యకలాపాలు జరగబోవని రాహుల్ స్పష్టం చేశారు. దీంతో పార్లమెంట్ ప్రతిష్టంభనపై చర్చించేందుకు కిరణ్ రిజిజు స్పీకర్ ఓం బిర్లా, హోం మంత్రి అమిత్ షాతో సమావేశమైనట్లు సమాచారం.

# చేనేత వస్త్రాల వినియోగాన్ని పెంపొందించడం మన లక్ష్యం

**అమరావతి, ఆగష్టు 05,(మనం ప్రతినిధి):** అమరావతిలోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్ఐడి) ఆధ్వర్యంలో బుధవారం జాతీయ చేనేత దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ప్రత్యేకంగా ఎన్ఐడి విద్యార్థులచే ఆకర్షణీయమైన చేనేత ఫ్యాషన్ షో,డిజైనింగ్ లో పలు పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా వీవర్స్ సర్వీస్ సెంటర్ డీడీ అనస్ షా. బి. మాట్లాడుతూ భారత ప్రభుత్వ జౌళి మంత్రిత్వ శాఖ, డెవలప్మెంట్ కమిషనర్ (చేనేత) కార్యాలయం పరిధిలోని చేనేత సేవా కేంద్రం (డబ్ల్యూయస్సీ), విజయవాడ ఆధ్వర్యంలో 12వ జాతీయ చేనేత దినోత్సవంను ఘనంగా జరుపుకుంటున్నామని తెలిపారు.1905 నాటి చారిత్రాత్మక స్వదేశీ ఉద్యమాన్ని స్మరించు కోవడానికి మరియు దేశ సాంస్కృతిక జౌళి వారసత్వాన్ని పరిరక్షించడంలో భారతీయ చేనేత నేతకారుల అమూల్యమైన రంగాన్ని గుర్తించడానికి ప్రతి సంవత్సరం ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపు కుంటున్నామన్నారు. అసలైన చేనేత ఉత్పత్తులపై అవగాహన పెంచడ

# శ్రీ వరలక్ష్మీ వ్రతానికి తిరుచానూరులో విస్తృత ఏర్పాట్లు

- భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేయాలి : టీటీడీ చైర్మన్ శ్రీ బీఆర్ నాయుడు

**తిరుపతి రూరల్ ఆగస్టు 5 మనం న్యూస్:** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో ఈ నెల 21న జరగనున్న పవిత్ర శ్రీ వరలక్ష్మీ వ్రత మహోత్సవం సందర్భంగా పాల్గొనే వేలాది మంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు విస్తృతంగా చేపట్టాలని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు అధికారులను ఆదేశించారు.

బుధవారం తిరుమలలోని చైర్మన్ క్యాంపు కార్యాలయంలో శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ అధికారులు, అర్చకులు చైర్మన్ను మర్యాదపూర్వకంగా కలిసి శ్రీ వరలక్ష్మీ వ్రత మహోత్సవానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తాగునీరు, అన్నప్రసాదాల పంపిణీ, సక్రమమైన క్యూ లైన్లు, భద్రత, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని సూచించారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో వ్రతంలో పాల్గొనేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు.అదేవిధంగా శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం, వ్రతం నిర్వహించే ఆస్థాన మండపాన్ని సుందరమైన పుష్పాలంకరణలతో శోభాయమానంగా అలంకరించి, మహోత్సవానికి తగిన ఆధ్యాత్మిక వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. అనంతరం చైర్మన్ దంపతులకు ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణలతో ఆశీర్వచనం అందజేశారు. ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్ పట్టువస్త్రాలు సమర్పించి, శ్రీ వరలక్ష్మీ వ్రత మహోత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీ బాబు స్వామి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పీసీపీ ఎన్డీటీ చట్టం, జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ అడ్వైజరీ కమిటీ సమావేశం

- లింగ నిర్ధారణ చట్టం కఠినంగా అమలు చేయాలి
- జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

**తిరుపతి ఆగష్టు 05 మనం న్యూస్:** బుధవారం జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలు నందు ప్రీ-కన్సెప్షన్ ప్రీ-నేటల్ డయాగ్నస్టిక్ టెక్నిక్స్ (పిసిపిఎన్ డిటి) చట్టాన్ని పటిష్టంగా అమలు చేయడానికి జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ కమిటీ జిల్లా స్థాయి ఎ ఆర్ టి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, లింగ నిర్ధారణ పరీక్షలు చట్టవిరుద్ధమని, ఈ చట్టాన్ని ఎవరైనా ఉల్లంఘించిన పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చట్టాన్ని అతిక్రమించే ఆసుపత్రులు, స్కాన్ సెంటర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, లైసెన్సులు రద్దు చేసే వరకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే జిల్లాలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఆసుపత్రులు, స్కాన్ కేంద్రాలను గుర్తించి, వాటిపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. లింగ సమతుల్యతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఆడ శిశువు సంరక్షణకు అందరు ముందుకు రావాలన్నారు. చిట్టమూరు, కెవిబిపురం, పెళ్లకూరు ,సూళ్లూరుపేట, పుత్తూరు మండలాల్లో సెక్స్ రేషియో తక్కువగా ఉండటానికి గల కారణాలను ఎక్స్పర్ట్ కమిటీ ద్వారా విశ్లేషించి నివేదిక సమర్పించాలన్నారుఈ సమావేశంలో భాగంగా పీసీపీ ఎన్డీటీ చట్టం పరిధిలో: కొత్త స్కాన్ సెంటర్ల రిజిస్ట్రేషన్ కొరకు 4 దరఖాస్తులు, 13 రెన్యువల్ దరఖాస్తులు,20 మార్పుల (మాడిఫికేషన్స్) దరఖాస్తులు మరియు ఏడు ఎఆర్టి సెంటర్లకు దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్ తెలిపారు. అన్ని దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించిన అనంతరం, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా వున్న వాటికి జిల్లా కలెక్టర్ ఆమోదం తెలిపారు. మూడు ఎఆర్టి సెంటర్లలో సిబ్బంది మరియు రికార్డుల నిర్వహణ సరిగా లేదని ఏఆర్టి సెంటర్లను తనిఖీ చేసిన బృందం తెలపడంతో ఆ మూడు సెంటర్లకు ప్రస్తుతం అనుమతులను వాయిదా వేయాలని కలెక్టర్ తెలిపారు.

# తిరుపతిలో ఘనంగా ఎస్ జె ఎఫ్ ఐ జాతీయ ఉపాధ్యక్షులు డా. టి. జనార్దన్ జన్మదిన వేడుకలు..

**తిరుపతి ఆగస్టు 5 మనం న్యూస్:** జాతీయ సీనియర్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు డా. టి.జనార్దన్ జన్మదిన వేడుకలు తిరుపతిలో ఆనందోత్సాహాల మధ్య అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి.ఈ వేడుకల్లో భాగంగా పలువురు ప్రముఖులు, శ్రేయోభిలాషులు,

మరియు సహచరులు డా.టి. జనార్దన్ ను స్వయంగా కలిసి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా హాజరైన అతిథులు మాట్లాడుతూ, వెటరన్ జర్నలిస్ట్ లకోసం, జర్నలిజం రంగంలో డా. టి.జనార్దన్ అందిస్తున్న సేవలు ఎంతో శ్లాఘనీయమని, ఇతరులకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఆయన ఎల్లప్పుడూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లి, మరింతో ఉన్నతంగా ప్రజా సేవకు అంకితం కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వెటరన్ జర్నలిస్టుల సంఘం జిల్లా అధ్యక్షులు యం.నరేంద్ర రెడ్డి, మేధావుల పోరం రాష్ట్ర కన్వీనర్ పురుషోత్తం రెడ్డి ఎపిడబ్ల్యూజెఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పానేటి చెంగల్రాయులు యాదవ్, సీనియర్ జర్నలిస్ట్ ఆదిమూలంశేఖర్, జి.సుకుమార్, పాల్గొన్నారు. అంతకు ముందుగా అనంత న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిరి కుమార్, అదే కళాశాలలో న్యాయవిద్య అభ్యసిస్తున్న డాక్టర్ టి. జనార్దన్ ను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు.

# చిత్తూరు పట్టణము నందు ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించిన చిత్తూరు ఒన్ టౌన్ పోలీసులు

**చిత్తూరు ఆగస్టు 5 మనం న్యూస్:** జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఆదేశాల మేరకు చిత్తూరు సబ్-డివిజన్ డి.ఎస్పీ జె.వెంకటనారాయణ ఆధ్వర్యంలో, సురక్షిత చిత్తూరు - మీ భద్రత మా బాధ్యత కార్యక్రమంలో భాగంగా చిత్తూరు ఒన్ టౌన్ సీఐ చిన్న పెద్దయ్య చిత్తూరు ఒన్

టౌన్ ఎస్.ఐ శివశంకర్ తో కలిసి ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించి ప్రజలకు భద్రతా అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ, ప్రజల భద్రతే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

నేరాల నివారణలో పోలీసులతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో కీలకమని పేర్కొన్నారు. తమ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు, గుర్తు తెలియని వస్తువులు లేదా చట్టవ్యతిరేక కార్యకలాపాలు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్కు లేదా డయల్-112కు సమాచారం అందించాలని సూచించారు.అలాగే మహిళలు, చిన్నారుల భద్రతకు సంబంధించిన అంశాలపై అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాల బారిన పడకుండా అపరిచితుల ఫోన్ కాల్స్, లింకులు, ఓటీపీలు బ్యాంకు వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని ప్రజలకు అవగాహన కల్పించారు.రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీటుబెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, మొబైల్ ఫోన్ వినియోగాన్ని పూర్తిగా నివారించాలని సూచించారు.

ప్రజల సహకారంతోనే నేరాలను సమర్థవంతంగా అరికట్టడంతో పాటు, పోలీసు-ప్రజల మధ్య సాన్నిహిత్యాన్ని మరింత బలోపేతం చేసి సురక్షిత చిత్తూరు - మీ భద్రత మా బాధ్యత లక్ష్యాన్ని విజయవంతంగా అమలు చేయగలమని సీఐ చిన్న పెద్దయ్య తెలిపారు.ఈ ఫుట్ పెట్రోలింగ్ లో చిత్తూరు ఒన్ టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

# బాల్యవివాహ నిరోధక చట్టం, పోక్సో చట్టం అవగాహన కల్పించిన చిత్తూరు జిల్లా శక్తీ టీం పోలీసులు.

**చిత్తూరు ఆగస్టు 5 మనం న్యూస్:** బాల్య వివాహాలు చట్టం ఫోక్సో చట్టం శక్తి యాప్ లపై మహిళలకు విద్యార్థి నీకు విద్యార్థినిలకు అవగాహన కార్యక్రమాన్ని చిత్తూరు మహిళా పోలీస్ స్టేషన్ అధికారులు సిబ్బంది నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు మహిళా డి.ఎస్పీ శ్రీ శ్రీనివాస రావు ఆధ్వర్యంలో శక్తి బృందాలు,మహిళ స్టేషన్ ఎస్.ఐ. సుబ్బారెడ్డి ఈరోజు చిత్తూరు పట్టణములోని లిటిల్ ఏంజెల్స్ స్కూల్ నందు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా మహిళా పోలీస్ స్టేషన్ ఎస్.ఐ మాట్లాడుతూ, బాల్యవివాహం ఒక పెద్ద సమస్య. బాలికలు 18 సంవత్సరాలు పూర్తిచేయక ముందే పెళ్లి జరపడం చట్ట విరుద్ధం. చిన్న వయసులో పెళ్లి చేస్తే చదువు ఆగిపోవడం, ఆరోగ్య సమస్యలు రావడం, భవిష్యత్తు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. అందుకే మీరు చదువులో ముందుకు వెళ్లి, జీవితాన్ని సక్రమంగా తీర్చిదిద్దుకోవాలి.పోక్సో చట్టం చాలా కఠినమైనది. 18 సంవత్సరాల లోపు పిల్లలపై లైంగిక వేధింపులు, దాడులు జరిగితే దానికి కఠినమైన శిక్షలు ఉంటాయి. ఇలాంటి సంఘటన ఎప్పుడైనా ఎదురైతే భయపడకుండా పోలీసులకు తెలియజేయాలి.అత్యవసర పరిస్థితుల్లో 112 (ఎమర్జెన్సీ నంబర్), 1098 (చైల్ హెల్ప్లైన్), వంటి హెల్ప్లైన్ నంబర్లను గుర్తుంచుకోవాలి. ఇవి మీకు వెంటనే సహాయం అందిస్తాయి.బాలికల కోసం ప్రభుత్వం అందించిన శక్తి యాప్ చాలా ఉపయోగకరమైనది. ఎటువంటి ప్రమాదం ఎదురైనా ఆ యాప్లో సులభంగా పోలీసులకు సమాచారం ఇవ్వగలరు. మీ భద్రత కోసం తప్పనిసరిగా ఈ యాప్ ఉపయోగించాలి.

మహిళల భద్రత కోసం ప్రభుత్వం ప్రారంభించిన శక్తి యాప్ అత్యవసర సమయంలో ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. అత్యవసర సమయంలో ఒకే (ఖిఖి) బటన్ ప్రెస్ చేయగానే సమీప పోలీస్ స్టేషన్కు సమాచారం చేరుతుంది. ఈ యాప్ అత్యవసర పరిస్థితుల్లో మహిళలకు తక్షణ సహాయం అందించేందుకు ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. ప్రమాదకర పరిస్థితుల్లో యాప్ ద్వారా పోలీసులకు సమాచారం చేరవేయడం, కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో పాటు, అత్యవసర సేవలు అందించేందుకు ఇది ఎంతో మేలైన సాధనమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్కూల్ కరెస్పాండెంట్ ప్రేమకుమారి, హెడ్ మాస్టర్ మహిళ స్టేషన్ ఏ.ఎస్.ఐ. వెంకటేశ్వరులు,సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో భద్రతా, చట్టాలపై అవగాహన పెంపే లక్ష్యంగా జిల్లాలోని పలు పాఠశాలల్లో శక్తి టీం విస్తృత అవగాహన కార్యక్రమాలు

- 1098 చైల్ హెల్ప్లైన్, 112 పోలీస్ అత్యవసర సేవల వినియోగంపై అవగాహన కల్పింపు

**తిరుపతి ఆగస్టు 5 మనం న్యూస్:** జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఆదేశాల మేరకు జిల్లాలో విద్యార్థుల్లో చట్టాలపై అవగాహన, చిన్నారుల భద్రత, మహిళల రక్షణ, మాదకద్రవ్యాల నిర్మూలన, సైబర్ నేరాల నివారణ లక్ష్యంగా శక్తి టీం పోలీసులు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం మంగళం ఎం.పీ.పీ. స్కూల్, పద్మావతి నగర్ ఎం.పీ.పీ. స్కూల్, అలాగే బాదూర్ జెడ్పీ హైస్కూల్, ఆర్.సి.పురంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.మంగళం, పద్మావతి నగర్ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు గుడ్ టచ్-బ్యాడ్ టచ్, చైల్ అబ్యూస్, చైల్ మిస్సింగ్, చైల్ కిడ్నాప్, చైల్ లేబర్ వంటి అంశాలపై సవివరంగా అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఏవైనా అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అదేవిధంగా క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు, మంచి స్నేహం, మంచి ప్రవర్తన, మంచి అలవాట్లు, చదువు విలువ, మొబైల్ గేమ్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలు వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవించాలని, ఉన్నత లక్ష్యాలతో విద్యను అభ్యసించాలని సూచించారు.

అలాగే బాదూర్ జెడ్పీ హైస్కూల్, ఆర్.సి.పురంలో నిర్వహించిన కార్యక్రమంలో, విద్యార్థులు, మహిళల భద్రత, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, రోడ్డు భద్రత - ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాల నివారణ వంటి అంశాలపై శక్తి టీం పోలీసులు సమగ్ర అవగాహన కల్పించారు. విద్యార్థులు సైబర్ మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా అనుసరించాలని, మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కూడా పాల్గొని విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు తమ సహకారాన్ని అందించారు.ఇటీవలి కాలంలో చిన్నారులు, మహిళలపై నమోదవుతున్న నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ, అత్యవసర పరిస్థితుల్లో 1098 చైల్ హెల్ప్లైన్ 112 పోలీస్ ఎమర్జెన్సీ హెల్ప్లైన్ సేవలను వినియోగించుకోవాలని విద్యార్థులకు వివరించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, మాట్లాడుతూ, చిన్నారులు, మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల్లో చిన్న వయస్సు నుంచే క్రమశిక్షణ, నైతిక విలువలు, చట్టాలపై అవగాహన పెంపొందించడం ద్వారా సమాజంలో నేరాల నియంత్రణకు దోహదపడుతుందని తెలిపారు. ఏవైనా అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే 112 పోలీస్ హెల్ప్లైన్ లేదా 1098 చైల్ హెల్ప్లైన్కు సమాచారం అందించాలని సూచించారు.

జిల్లాలో విద్యార్థులు, మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ తిరుపతి జిల్లా పోలీసులు ఇలాంటి అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తారని తెలిపారు.

# యెమెన్ దేశం నుండి విరూపాక్షపురం పక్షవాత నివారణ ఆయుర్వేద కేంద్రానికి రోగి

- సంప్రదాయ ఆయుర్వేద వైద్యానికి పెరుగుతున్న అంతర్జాతీయ ఆదరణ

**పలమనేరు ఆగస్టు 5 మనం న్యూస్:** చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గంలోని విరూపాక్షపురం గ్రామంలో ఉన్న సంప్రదాయ ఆయుర్వేద పక్షవాత నివారణ వైద్య కేంద్రానికి విదేశాల నుంచి కూడా రోగులు తరలివస్తుండటం విశేషంగా నిలుస్తోంది.

ఎన్నో దశాబ్దాలుగా పక్షవాత బాధితులకు ఆయుర్వేద పసరు మందుతో చికిత్స అందిస్తూ విశేష గుర్తింపు పొందిన వైద్య నిపుణులు మోహన్రావు, ఆయన కుమార్తె డాక్టర్ అశ్విని ఆధ్వర్యంలో ఈ సేవలు కొనసాగుతున్నాయి.ఈ ఆయుర్వేద వైద్య కేంద్రంలో ఇప్పటివరకు వేలాది మంది పక్షవాత బాధితులు చికిత్స పొంది సాధారణ జీవితంలోకి తిరిగి వచ్చినట్లు స్థానికులు, రోగులు చెబుతున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి మాత్రమే కాకుండా విదేశాల నుంచి కూడా రోగులు వచ్చి చికిత్స పొందడం ఈ కేంద్రానికి ఉన్న విశ్వసనీయతకు నిదర్శనంగా నిలుస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం యెమెన్ దేశానికి చెందిన ఓ కుటుంబం విరూపాక్షపురంలోని ఆయుర్వేద కేంద్రాన్ని సందర్శించింది. పక్షవాత సమస్యతో బాధపడుతున్న కుటుంబ సభ్యుడికి సంప్రదాయ ఆయుర్వేద వైద్యం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ, అనేక ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నప్పటికీ ఆశించిన ఫలితం రాలేదని, విరూపాక్షపురం ఆయుర్వేద వైద్యం గురించి పలువురి ద్వారా తెలుసుకుని ఎంతో నమ్మకంతో ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. ఇక్కడ అందిస్తున్న చికిత్సతో తమ ఆరోగ్యం మెరుగుపడుతుందనే పూర్తి విశ్వాసం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ అశ్విని మాట్లాడుతూ, తమ తాతగారు, తండ్రి మోహన్రావు అందించిన సంప్రదాయ ఆయుర్వేద వైద్య సేవలను వారసత్వంగా కొనసాగించడం తమ అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. పక్షవాతంతో నిస్సహాయ స్థితిలో వచ్చిన రోగులు కోలుకుని తిరిగి నడుస్తూ, ఆనందంగా తమను ఆశీర్వదిస్తూ వెళ్లడం కన్నా గొప్ప సంతృప్తి మరొకటి ఉండదన్నారు.ఎలాంటి ప్రచారానికి ఆశపడకుండా సేవాభావంతో ప్రజలకు ఆయుర్వేద వైద్యం అందించడం తమ కుటుంబ లక్ష్యమని, భవిష్యత్తులో కూడా మరింత మంది పక్షవాత బాధితులకు అందుబాటులో ఉండేలా సేవలను విస్తరిస్తామని వెల్లడించారు.

# కపిలతీర్థం, మాల్వాడి గుండం ప్రాంతాల్లో తుడా ఛైర్మన్, మున్సిపల్ కమిషనర్ క్షేత్రస్థాయి పరిశీలన

**తిరుపతి,ఆగస్టు 05, మనంన్యూస్:** తిరుపతి నగర ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీటిని అందించడంతో పాటు వర్షపు నీటిని సమర్థవంతంగా వినియోగించుకునేందుకు తుడా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిశానిర్దేశంలో చేపట్టిన ' సిటీ ఆఫ్ ట్యాంక్స్' ప్రణాళికలో భాగంగా తిరుమల ఏడుకొండల నుంచి ప్రవహించే సహజసిద్ధ జలధారలైన కపిలతీర్థం, మాల్వాడి గుండం నీటిని నిల్వ చేసి సద్వినియోగం చేసుకోవడానికి ముమ్మర చర్యలు చేపట్టారు.

ఈ మేరకు బుధవారం సాయంత్రం తుడా ఛైర్మన్, టీటీడీ ఎక్స్ అఫిషియో మెంబర్ డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి, తిరుపతి మున్సిపల్ కమిషనర్ శారద దేవి, జలవనరుల శాఖ అధికారులతో కలిసి కపిలతీర్థం, మాల్వాడి గుండం, ఎన్జీవో కాలనీ ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు... ఈ సందర్భంగా తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ ఎంతటి తీవ్రమైన వరద వచ్చినా తట్టుకునేలా నగరంలో వరద నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. స్వచ్ఛమైన వర్షపు నీరు మురుగు కాలువల్లో కలవకుండా అడ్డుకట్ట వేస్తూ, కాలువల్లో ఆక్రమణలను తొలగించి ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వివరించారు.కపిలతీర్థం నుంచి పారే నీటిని మురుగు కాలువల వైపు మళ్లించకుండా, ఎన్జీవో కాలనీ పార్క్ వద్ద 'భూగర్భ జల నిధి పెంపు' ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. దాదాపు 200 మీటర్ల మేర రీఛార్జ్ ప్రక్రియ చేపట్టి, ప్రత్యేక బోర్లు, ఎలక్ట్రిక్ నీటి ప్రవాహ వ్యవస్థ, రెండు ఫిల్టరింగ్ ట్యాంకులను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. దీనిద్వారా నగరం చుట్టూ దాదాపు 5 కిలోమీటర్ల పరిధిలో భూగర్భ జలాలు గణనీయంగా పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అటవీ శాఖ పరిధిలోని 3 కుంటలను అభివృద్ధి చేసి గరిష్టంగా నీటిని నిల్వ చేసే అవకాశంపై అధికారులతో చర్చించినట్లు తెలిపారు. అటవీ శాఖ కార్యాలయం సమీపంలో ఫిల్టర్ స్టేషన్, ఫిల్టర్ బెడ్లు నిర్మించి, నీటిని శుద్ధి చేసి నగరవాసులకు అందిస్తామన్నారు. తిరుపతిలోని 5-6 లక్షల స్థానిక జనాభాతో పాటు రోజువారీగా వచ్చే 1 నుండి 1.5 లక్షల మంది భక్తుల నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ఎలాంటి నీటి కొరత లేకుండా మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామని స్పష్టం చేశారు. అలాగే ప్లాస్టిక్ వ్యర్థాలను అరికట్టడం, వ్యర్థ నీరు చెరువుల్లో కలవకుండా ప్రతి చెరువు వద్ద 'సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్' నిర్మించే ఆలోచనలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తుడా సెక్రటరీ డాక్టర్ ఎన్.వి. శ్రీకాంత్ బాబు, ఎస్.ఈ. రవీంద్రయ్య, జలవనరుల శాఖ ఎస్.ఈ. పి.వి. ప్రసాద్, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్ రెడ్డితో పాటు మున్సిపల్, ఇరిగేషన్, తుడా అధికారులు పాల్గొన్నారు.

# మాతృ మరణాలపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలి

**తిరుపతి, ఆగస్టు 5 మనం న్యూస్:** జిల్లాలో ఇటీవల పెళ్లకూరు, ఎం.ఆర్. పల్లి అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో జరిగిన రెండు మాతృ మరణాలపై సమగ్రంగా విచారణ చేపట్టి, మరణాలకు దారితీసిన కారణాలను గుర్తించి పూర్తి నివేదికను సమర్పించాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో మాతృ మరణాలపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చోటుచేసుకున్న మాతృ మరణాల వివరాలు, సంబంధిత గర్భిణులకు అందించిన వైద్య సేవలు, ప్రసవానికి ముందు మరియు ప్రసవ సమయంలో తీసుకున్న వైద్యపరమైన చర్యలు, ఆసుపత్రులకు తరలించిన విధానం తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. పెళ్లకూరు, ఎం.ఆర్. పల్లి అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో జరిగిన రెండు మాతృ మరణాలకు సంబంధించిన కేసులను క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. గర్భిణులకు అందించిన ప్రాథమిక వైద్యం నుంచి ఉన్నత వైద్య సేవల కోసం రిఫర్ చేసిన విధానం వరకు ప్రతి అంశాన్ని పరిశీలించి, ఎక్కడైనా లోపాలు, జాప్యం లేదా సమన్వయ లోపం ఉన్నట్లయితే వాటిని స్పష్టంగా గుర్తించాలని సూచించారు. మాతృ మరణాల నివారణకు గర్భిణుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించడం, హైరిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించడం, వారికి అవసరమైన వైద్య సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవడం అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామీణ స్థాయిలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది హైరిస్క్ గర్భిణులను గుర్తించి, అవసరమైన సందర్భాల్లో సమీప ఆరోగ్య కేంద్రాలకు, తదుపరి స్థాయి ఆసుపత్రులకు

సకాలంలో సిఫార్సు చేయాలని సూచించారు.అత్యవసర పరిస్థితుల్లో గర్భిణులను తరలించే సమయంలో ఎలాంటి జాప్యం జరగకుండా అంబులెన్స్ సేవలు, వైద్య సిబ్బంది, సంబంధిత ఆరోగ్య కేంద్రాల మధ్య సమన్వయం ఉండాలని ఆదేశించారు. ప్రతి మాతృ మరణాన్ని ఒక హెచ్చరికగా పరిగణించి, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన నివారణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

మాతృ మరణాలపై నిర్వహించే విచారణలో వాస్తవ పరిస్థితులను సమగ్రంగా నమోదు చేసి, కారణాలు, వైద్య సేవల వివరాలు, తీసుకున్న చర్యలు, లోపాలు ఉంటే వాటి వివరాలతో కూడిన నివేదికను నిర్ణీత సమయంలో సమర్పించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బాలకృష్ణ నాయక్, డి సి హెచ్ ఎస్ ఆనందమూర్తి, సంబంధిత వైద్యాధికారులు, కమిటీ సభ్యులు, ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తానో రహస్యమే...

కాలం ఏదో ఒక నెపంతో
బాధిస్తూ చెప్పకపోతే
తనకి విలువ ఉండదని
భయం కాబోలు
పచ్చి నిజాల నుండి కూడా
నాలుగు కన్నీటి చుక్కలని
గురు దక్షిణ కోరకుండా
ఉండలేదు అనుకుంటా
కొన్ని రాత్రుళ్ళు
నిద్రను తాకట్టు పెట్టుకుని
కొన్ని పగుళ్లను
చీకటితో చిట్లకొట్టి
కోరికల పావులతో
మనిషిని ఉసిగొల్పి
మనసు చదరంగంలో
ఓటమిని చవి చూపుతుంది..
సమస్యల మధ్య నలిగే మనిషిలో
ఊపిరిని ఒడిసిపట్టి
ప్రాణం పోకుండా కక్ష తీర్చుకుంటుంది..
ప్రశ్నల అంపశయ్య
జీవితాన్ని పడుకోపెట్టి
బతుకును ముళ్ళు కర్రతో
అదిలిస్తుంది...
ఎంత చదువుకున్నా
ఇంకెక్కడో మార్కులు తగ్గినట్లు
ఇంకేదో తప్పుపడుతూ
మోసంతో ద్రోహం చేస్తుంది.
ఎండిన ఆశతో చిగురు చేతులు కలిపితే
ఓర్వలేని చూపులు
చటుక్కున తుంపుతాయి
నమ్మి పూజించినా
తన నిజస్వరూపంతో
నమ్మలేని సమస్యతో
గొప్పగా పరీక్ష పెడుతుంది.
ఫలితాలని దాచిపెడుతుంది..
కాలం నాలుగు దిక్కులుగా
కాలం నాలుగు గోడలుగా
ఓ మాయలా....ఓ గాయంగా
ఓ పాఠంలా.... ఓ ప్రశ్నలా
తానో రహస్యమే

**- చందలూరి నారాయణరావు**
9704437247

# సముద్రంలో కలిసిపోతున్న భారత తీరం!

ప్రకృతి ఆగ్రహం, మానవ తప్పిదాల నడుమ భారతావని తీరరేఖ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతోంది. సముద్ర గర్భంలో కలిసిపోతున్న భూభాగాలు, అలల ఉద్ధృతికి విలవిలలాడుతున్న మత్స్యకార గ్రామాలు మనకు ఇస్తున్న హెచ్చరికలను ఇకనైనా గుర్తించకపోతే భవిష్యత్తు సాగరార్పణం కాక తప్పదు.

పర్యావరణ వైపరీత్యాలు, అస్తవ్యస్త మానవ చర్యల మూలంగా భారత తీర ప్రాంతం ఒకవైపు దారుణమైన కోతకు గురవుతుంటే మరోవైపు అలలు, నదుల ద్వారా ఇసుక, ఒండ్రు మట్టి పేరుకుపోయి కొన్ని చోట్ల తీరం ముందుకు రావడం (వృద్ధి/అక్రీషన్) జరుగుతోంది. 1990 నుంచి 2022 మధ్య కాలంలో మొత్తం భారత తీరప్రాంతంలో 34.2 శాతం కోతకు గురైతే, 26.3 శాతం మేర వృద్ధి నెలకొంది. మరో 39.5 శాతం తీరం స్థిరంగా ఉంది. ఇటీవల లోక్‌సభ వేదికగా కేంద్ర ప్రభుత్వం వెల్లడించిన ఈ గణాంకాలు కేవలం భౌగోళిక మార్పులను తెలిపే సంఖ్యలు మాత్రమే కావు. ఇవి మన తీరప్రాంతాల నిలకడను, అక్కడి కోట్లమంది ప్రజల భవిష్యత్తును తీవ్రంగా ప్రశ్నిస్తున్న ప్రమాద హెచ్చరికలు.

నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చ్ సంస్థ సుదీర్ఘ కాలం పాటు ఉపగ్రహ రిమోట్ సెన్సింగ్, క్షేత్రస్థాయి పరిశీలనల ద్వారా జరిపిన సమగ్ర విశ్లేషణ ఇది. రాష్ట్రాల వారీగా తీరప్రాంత వృద్ధి (మేట)శాతాలను పరిశీలిస్తే ఒడిశా 54.6%, ఆంధ్రప్రదేశ్ 44%, కర్ణాటక 26.2%, పశ్చిమ బెంగాల్ 25.2%, గుజరాత్ 22.7%, కేరళ 20.5%, తమిళనాడు 20.2%, మహారాష్ట్ర 10%, గోవా 9.7%,పుదుచ్చేరి 8.3%, డామన్-డయ్యూ 7.1%గా నమోదయ్యాయి. ఇక్కడ ఒక విషయం గమనించాలి. ఇవి తీర విస్తీర్ణం పెరిగిన శాతాలు కావు, మొత్తం తీర రేఖలో అక్రీషన్ (మేట) జరిగిన భాగం యొక్క శాతాలు మాత్రమే! ఇక తీర కోత విషయానికి వస్తే, దేశంలోనే అత్యధికంగా 60.5 శాతంతో పశ్చిమ బెంగాల్ అగ్రస్థానంలో నిలవడం ఆందోళనకరం. పుదుచ్చేరి (47.3%), కేరళ (43.9%), తమిళనాడు (39.2%) లలో కూడా కోత తీవ్రత ప్రమాదకర స్థాయిలో ఉంది.

**తూర్పున విలయం... పశ్చిమాన అస్థిరత**

ఈ దృశ్యం సాధారణమైనది కాదు. ముఖ్యంగా తూర్పు తీరంలో (బెంగాల్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు) సంభవిస్తున్న మార్పులు అత్యంత వేగవంతంగా ఉన్నాయి. గోదావరి, కృష్ణ, మహానది వంటి జీవనదులు మోసుకొచ్చే ఒండ్రు మట్టి ఒకవైపు నూతన భూభాగాన్ని సృష్టిస్తుంటే మరోవైపు బంగాళాఖాతంలో రూపుదిద్దుకునే తుఫానులు, సముద్ర మట్టాల పెరుగుదల, తీవ్ర వాతావరణ మార్పులు కోతను విపరీతంగా తీవ్రతరం చేస్తున్నాయి.

పశ్చిమ తీరంలో (గుజరాత్, మహారాష్ట్ర, గోవా) భౌగోళికంగా స్థిరత్వం కాస్త ఎక్కువగా ఉన్నప్పటికీ, కేరళలో తీర కోత శాతాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ వినాశనానికి ప్రకృతితో పాటు మానవ తప్పిదాలే ప్రధాన కారకాలు. అడ్డగోలుగా నిర్మిస్తున్న ఓడరేవులు, హార్బర్లు, నదులపై కడుతున్న డ్యాములు సహజసిద్ధమైన సెడిమెంట్ ప్రవాహాన్ని అడ్డుకుంటున్నాయి. దీనికితోడు పరిమితి లేని బీచ్ మైనింగ్, అక్రమ తీర ప్రాంత నిర్మాణాలు ప్రకృతి సమతుల్యతను దారుణంగా దెబ్బతీస్తున్నాయి.

**జీవనోపాధిపై కోలుకోలేని దెబ్బ**

ఆంధ్రప్రదేశ్‌లో 31 శాతం తీరం కోతకు గురవుతుంటే, 44 శాతం వృద్ధి నమోదైంది. కాకినాడ, పశ్చిమ గోదావరి జిల్లాల్లో తీర కోత ఏకంగా 50 శాతం సరిహద్దును దాటేసింది. అయితే బాపట్ల, కోనసీమ, విజయనగరం జిల్లాల్లో తీరం ముందుకు రావడం నిరంతరం జరుగుతోంది. ఒడిశాలో తీర వృద్ధి ఎక్కువగా ఉన్నప్పటికీ, కోతకు గురవుతున్న ప్రాంతాల్లో మత్స్యకారులు, తీరప్రాంత రైతుల జీవనోపాధి దారుణంగా దెబ్బతింటోంది. ఇక పశ్చిమ బెంగాల్లో 60 శాతానికి పైగా నమోదవుతున్న కోత అటు ప్రపంచ ప్రసిద్ధ సుందర్‌బన్‌లతోపాటు పరిసర ద్వీపాలను ముంపు ప్రమాదంలోకి నెట్టేసింది. ఇక్కడ భూమి కొట్టుకుపోవడం అనేది కేవలం భౌగోళిక మార్పు మాత్రమే కాదు.. తీరప్రాంత ప్రజల నివాసాలు, నిత్యం సాగుచేసే పొలాలు, ఉపాధినిచ్చే చేపల వేట స్థలాలు సముద్ర గర్భంలో మాయమవుతున్నాయి. పర్యవసానంగా, మత్స్యకార సమాజాలు, తీరప్రాంత నిరుపేదలు నివాసాలు కోల్పోయి శరణార్థులుగా మారుతున్నారు.

**శాశ్వత పరిష్కారాల వైపు అడుగులు పడాలి!**

తీర రక్షణ కోసం కేవలం కాంక్రీట్ రాతి గోడలు నిర్మిస్తే సరిపోదని పాలకులు గ్రహించాలి. అవి ఒక చోట తీరాన్ని కాపాడినా, అలల రాపిడి వల్ల మరొక చోట కోతను రెట్టింపు చేస్తాయి. NCCR ఇప్పటికే సమగ్ర షోర్లైన్ మ్యాపులు, నిర్వహణ ప్రణాళికలు తయారు చేసింది. పుదుచ్చేరి, కేరళలోని చెల్లనంలో చేపట్టిన బీచ్ పునరుద్ధరణ (Beach Restoration) ప్రాజెక్టులు మంచి విజయాలను అందించాయి. కానీ ఇవి కొద్ది ప్రాంతాలకే పరిమితం కాకూడదు. పర్యావరణ అనుకూల సాధనాలు (Soft Solutions) అయిన బీచ్ నోరిష్మెంట్, మడ అడవుల (మాంగ్రోవ్స్) విస్తృత పునరుద్ధరణ, సమర్థవంతమైన సెడిమెంట్ నిర్వహణ అత్యవసరంగా జరగాలి. వాతావరణ మార్పులకు అనుగుణమైన అనుకూల విధానాలు (Climate Adaptation), బాధిత ప్రజలకు మెరుగైన పునరావాస (Resettlement) ప్రణాళికలు రూపుదిద్దుకోవాలి. 15వ ఆర్థిక సంఘం సూచనల మేరకు 'నేషనల్ డిజాస్టర్ మిటిగేషన్ ఫండ్' (NDMF) ద్వారా దీనికి తగినన్ని నిధులు తక్షణమే కేటాయించాలి.

**సమగ్ర కార్యాచరణే ఏకైక శరణ్యం!**

తీరం అనేది కేవలం మన మ్యాప్‌లోని భౌగోళిక మార్పు కాదు. అది కోట్లాది మంది జీవనాధారం, మన సంస్కృతి, ఉపాధి మరియు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముక. కోతను అరికట్టడానికి శాస్త్రీయ చర్యలు తీసుకోకపోతే, ఈ రోజు ముందుకు వచ్చిన మేట ప్రాంతాలు కూడా రేపటి రోజున సముద్రంలో కలిసిపోక తప్పదు. సమగ్ర తీరప్రాంత నిర్వహణ (ICZM), స్థానిక మత్స్యకార సమాజాల భాగస్వామ్యం, దీర్ఘకాలిక శాస్త్రీయ ప్రణాళికలు లేకపోతే ఈ ద్వంద్వ సంక్షోభాన్ని ఎదుర్కొనడం సాధ్యం కాదు.

సముద్రపు ఉద్ధృతిని శాంతింపజేసి, అటు కోతను అరికడుతూ ఇటు మేట ప్రాంతాలను స్థిరమైన నివాసాలుగా మార్చాలి. లేకపోతే, మనం అనుభవిస్తున్న ఈ సుందర తీరం రాబోయే తరాలకు లభించే గొప్ప వారసత్వంగా కాకుండా, మన అనాలోచిత తప్పిదాలకు నిలువెత్తు సాక్ష్యంగా మిగిలిపోయే ప్రమాదం ఉంది.

**- కాలగిరి శ్రీనివాస్ రెడ్డి**
9010128884

# చరిత్రను మలిచిన రాజ్యాంగ నిర్ణయం

భారత రాజ్యాంగ చరిత్రలో కొన్ని నిర్ణయాలు వాటి ప్రభావంతోనే చిరస్థాయిగా నిలిచిపోతాయి. 2019 ఆగస్టు 5న అధికరణం 370ను అమలులో లేకుండా చేయడం అలాంటి నిర్ణయమే. ఏడు దశాబ్దాలుగా ప్రత్యేక రాజ్యాంగ హోదాతో కొనసాగిన జమ్మూ-కశ్మీర్‌ను దేశ రాజ్యాంగ వ్యవస్థలో పూర్తిస్థాయిలో భాగం చేసిన ఘట్టమది. అనంతరం జమ్మూ-కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం అమలుతో జమ్మూ-కశ్మీర్, లడఖ్ అనే రెండు కేంద్ర పాలిత ప్రాంతాలు ఏర్పడ్డాయి. 2023 డిసెంబరులో సుప్రీంకోర్టు ఈ నిర్ణయాన్ని రాజ్యాంగబద్ధమని తేల్చడంతో చట్టపరమైన అనిశ్చితికి తెరపడింది. ఇప్పుడు ప్రశ్న ఒక్కటే-ఈ నిర్ణయం జమ్మూ-కశ్మీర్‌ను ఏ మేరకు మార్చింది?




అధికరణం 370 రద్దుతో జమ్మూ-కశ్మీర్ కూడా దేశంలోని మిగిలిన ప్రాంతాల మాదిరిగానే భారత రాజ్యాంగ పరిధిలో పూర్తిస్థాయిలోకి వచ్చింది. కేంద్ర చట్టాలు, సంక్షేమ పథకాలు, సామాజిక న్యాయానికి సంబంధించిన నిబంధనలు సమానంగా అమలులోకి వచ్చాయి. మహిళలు, షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, ఇతర వెనుకబడిన వర్గాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు మరింత విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయి. పరిపాలనా వ్యవస్థలో ఏకరూపత పెరగడంతో నిర్ణయాల అమలు వేగవంతమైంది. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యాయి. ఒకే దేశం-ఒకే రాజ్యాంగం అనే భావనకు ఆచరణాత్మక రూపం లభించింది.

గత ఏడేళ్లలో భద్రతా పరిస్థితుల్లో గణనీయమైన మార్పు నమోదైంది. రాళ్లు రువ్వే ఘటనలు దాదాపు అంతరించగా, ఉగ్రవాద ఘటనల ధోరణి కూడా తగ్గుముఖం పట్టింది. భద్రతా బలగాల సమన్వయం, సరిహద్దు పర్యవేక్షణ, ఉగ్రవాద నిరోధక చర్యలు మరింత బలోపేతమయ్యాయి. శాంతియుత వాతావరణం ఏర్పడటంతో సాధారణ జీవనం తిరిగి గాడిలో పడింది.

ఈ మార్పు ప్రభావం అభివృద్ధి రంగంలో స్పష్టంగా కనిపిస్తోంది. జాతీయ రహదారులు, సొరంగ మార్గాలు, రైల్వే అనుసంధానం, వైద్య, విద్యా రంగాల్లో చేపట్టిన ప్రాజెక్టులు ప్రాంత రూపురేఖలను మారుస్తున్నాయి. దేశ ప్రధాన ఆర్థిక ప్రవాహంతో జమ్మూ-కశ్మీర్ అనుసంధానం మరింత బలపడుతోంది. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు విస్తృతంగా అమలవుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల విస్తరణకు దోహదపడుతున్నాయి.

ఈ మార్పుకు పర్యాటక రంగమే అత్యంత స్పష్టమైన నిదర్శనం. ఇటీవల సంవత్సరాల్లో రికార్డు స్థాయిలో పర్యాటకులు జమ్మూ-కశ్మీర్‌ను సందర్శించారు. హోటళ్లు, హోమ్‌స్టేలు, రవాణా, చేతి వృత్తులు, చిన్న వ్యాపారాలు కొత్త చైతన్యం పొందాయి. పర్యాటకం స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వడమే కాదు, జమ్మూ-కశ్మీర్‌ను దేశ ప్రజలతో మరింత భావోద్వేగ పూర్వకంగా అనుసంధానిస్తోంది.

అధికరణం 370 రద్దు ఒక రాజ్యాంగ సవరణ మాత్రమే కాదు. జమ్మూ-కశ్మీర్ అభివృద్ధి ప్రస్థానానికి కొత్త దిశను చూపిన నిర్ణయం. మౌలిక వసతుల విస్తరణ, పరిపాలనా సంస్కరణలు, కేంద్ర సంక్షేమ పథకాల అమలు, పెట్టుబడులకు అనుకూల వాతావరణం, యువతకు విస్తరిస్తున్న అవకాశాలు-ఇవన్నీ కలిసి కొత్త జమ్మూ-కశ్మీర్ నిర్మాణానికి పునాది వేస్తున్నాయి.

ఈ మార్పు నిరంతరంగా కొనసాగితే జమ్మూ-కశ్మీర్ కేవలం సరిహద్దు ప్రాంతంగా కాదు, ఉత్తర భారత అభివృద్ధికి కీలక కేంద్రంగా ఎదిగే సామర్థ్యం కలిగి ఉంది. అధికరణం 370 రద్దు భారత రాజ్యాంగ చరిత్రలో ఒక మైలురాయి. అయితే దాని అసలైన విలువ చట్టపుస్తకాలలో కాదు. శాంతి నెలకొన్న గ్రామాల్లో, అవకాశాలు పెరిగిన యువతలో, అభివృద్ధి ఫలాలు అందుకుంటున్న ప్రజల జీవితాల్లో కనిపించాలి. అదే ఈ చారిత్రక నిర్ణయానికి శాశ్వత విజయగాథ అవుతుంది.

**- కింజరాపు అమరావతి**

# తెలంగాణ దిక్సూచి జయశంకర్

ఆధిపత్యశక్తులపై అతడు వీరభద్రుడు, ఆలోచనల అవసరాన్ని తెలిపిన నిబద్ధుడు, తెలంగాణ కనుగొన్న అతడు మరో బుద్ధుడు, అతడే ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్. తెలంగాణను స్వప్నించి, శాసించిన మహోపాధ్యాయుడు జయశంకర్ సార్ వరంగల్ జిల్లా, ఆత్మకూరు మండలం అక్కన్నపేట గ్రామంలో లక్ష్మీ కాంతారావు, మహాలక్ష్మి దంపతులకు 1934 ఆగస్టు 6న జన్మించాడు. హనుమకొండ లోని మర్కజీ పాఠశాలలో ప్రాథమిక విద్య నేర్చాడు. హనుమకొండ న్యూ హైస్కూల్లో మాధ్యమిక వరకు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్.ఎస్.సీ వరకు చదువుకున్నాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని బి.ఏ పూర్తి చేశాడు. బెనారస్ విశ్వవిద్యాలయం, అలీగడ్ విశ్వవిద్యాలయం నుండి పి.జి పూర్తి చేశాడు. జయశంకర్ సార్ సమస్యల పట్ల ఏ విధంగా స్పందించాలో, ఏ విధంగా ఉద్యమంగా తీర్చి దిద్దాలో నిరూపించే సంఘటన ఒకటి ఈయన విద్యాభ్యాస కాలంలో జరిగింది.



అప్పట్లో వరంగల్‌లో డిగ్రీ కళాశాల లేదు. డిగ్రీ చదవా లంటే హైదరాబాదుకు వెళ్లాలి. లెక్చరర్స్ ప్రొద్బలంతో డిగ్రీ కాలేజీ కావాలని విద్యార్థులు ఉద్యమించారు. అందులో మొదటి వరుసలో జయశంకర్ ఉన్నాడు. ఈ సంఘటన తర్వాత పదేళ్లకు డిగ్రీ కాలేజీ, 30 ఏళ్లకు యూనివర్సిటీ వచ్చింది. ఏదైతే డిగ్రీ కాలేజీ యూనివర్సిటీ కోసం ఉద్యమం చేసిండో అదే యూనివర్సిటీకి ఆచార్య జయశంకర్ వైస్ ఛాన్సలర్ అయ్యాడు. 1960లో ఉపాధ్యాయ వృత్తిలో అడుగు పెట్టడం ద్వారా ఉద్యోగ జీవితం మొదలైంది. హనుమకొండలో ఉపాధ్యాయుడిగా నియామకమై, లెక్చరర్ గా ఆదిలాబాద్‌కు పోయాడు. 1975-79 వరకు సీ కె ఎం కళాశాల ప్రిన్సిపల్‌గా, బోర్డు మెంబర్ గా సేవలందించాడు. 1982-91 వరకు సీఫేల్ రిజిస్టర్‌గా పని చేశాడు. 1991-94 వరకు కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ గా పనిచేశాడు. ఇవే కాక వివిధ ప్రభుత్వం ఉద్యోగాల్లో సంఘాల పదవుల్లో పనిచేసి తనదైన ముద్ర వేశాడు. ఇన్ని పదవుల్లో పనిచేసిన నాకు సీ. కె ఎం. కళాశాల ప్రిన్సిపల్‌గా పని చేయడం ఎక్కువ తృప్తినిచ్చింది అని స్వయంగా అన్నాడు. 1952లో ఇంటర్మీడియట్ విద్యార్థిగా తెలంగాణకు జై కొట్టి తరగతులను బహిష్కరించాడు. వరంగల్లో మొదలైన ఉద్యమం హైదరాబాద్ కేంద్రీకృతమైంది. 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో పాల్గొని తెలంగాణ సాధనకు ఎలాంటి వ్యూహాలు రచించారు తెలంగాణ ఉద్యమా నికి మూడు దశలు ఉన్నాయి.

మొదటిది భావజాల వ్యాప్తి. అది జరిగింది. రెండవది ఆందోళన కార్యక్రమం. అది కొనసాగుతున్నది. ఇక మిగిలింది రాజకీయ ప్రక్రియ అది జరగాల్సి ఉంది. దానిని పూర్తి చేయడమే ఉద్యమ కర్తవ్యం కావాలి. దానికి రాజకీయ చిత్తశుద్ధి అవసరము ఇప్పుడున్న రాజకీయ నాయకత్వం ఆ పని పూర్తి చేస్తుందని అని నేను నమ్ముతున్నాను అని జయశంకర్ అన్నాడు. మూడు దశలో కూడా జయశంకర్ పాత్ర మరువలేనిది. అందుకే అతడు తెలంగాణ సిద్ధాంతకర్త. మొదటిది తెలంగాణ భావజాల వ్యాప్తి. అది ప్రజలలో చొచ్చుక పోయిందో జయశంకర్ ఒక రోజు ఇట్లు చెప్పిండు. 'ఎందుకమ్మా తెలంగాణ అంటే? సార్ తెలంగాణ వస్తే మా పొలాలకు నీళ్లు వస్తాయి, మా పోరగాళ్ళు కొలువులు వస్తాయి. అనే భావన వారికి కలిగింది ' చదువురాని ఆడవాళ్లు చెప్పిన మాటలు జ్ఞాపకం చేసుకున్నాడు. జయశంకర్ విద్యార్థి, సంఘ నాయకుడు గొప్ప పరిపాలనాదక్షుడు. తెలంగాణ కోసం అహర్నిశలు శ్రమించిన కార్యశురుడు. తెలంగాణ కోసం తెలంగాణ రాజకీయ నాయకులకు తన సహకారం అందించాడు. చెన్న రెడ్డి నుండి చంద్రశేఖర్ రావు వరకు ప్రతి ఒక్కరి రాజకీయ పార్టీకి తన మేదో శ్రమను ధరపోశాడు. అయన ఆశిన్నట్లే చివరగా రాజకీయ ప్రక్రియతోనే తెలంగాణ వచ్చింది. అందరిని తన మార్గంలో నడిపించాడు. అందుకే అతడు మార్గదర్శి. తెలంగాణకు చిరునామా, తెలంగాణ కోసం జీవితాన్ని అంకితం చేసిన మహానుభావుడు జయశంకర్ సార్.

**ఆగస్టు 6 ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా..**

**- దేవులపల్లి రమేశ్**
9963701294

# 'చట్టం'తో బీసీలకు రక్షణ

**దేశంలోనే మొట్టమొదటిసారిగా బీసీ రక్షణ చట్టం తీసుకొస్తున్న ఏపీ : సవిత**

**5 ఏళ్ల పాటు బీసీలను వేధించిన గత పాలకులు: మంత్రి అచెన్నాయుడు**

**విజయవాడలో మంత్రి సవిత నేతృత్వంలో బీసీ రక్షణ చట్టంపై కీలక భేటీ**

**పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు**

**(విజయవాడ,ఆగస్టు,05,మనం బ్యూరో):** బీసీ రక్షణ చట్టంతో వెనుబడిన వర్గాలు గౌరవ ప్రదంగా సామాజిక జీవనం కొనసాగించేలా రక్షణ కల్పిస్తున్నామని, కులం, వృత్తుల పేరుతో దూషిస్తే కఠినంగా శిక్షించేలా చట్టం రూపొందిస్తున్నామని మంత్రులు ఎస్.సవిత, అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ చట్టంపై మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల అభిప్రాయాలు తీసుకున్నామని, త్వరలో జిల్లా స్థాయిలోనూ బీసీ సంఘాల ప్రతినిధుల నుంచి సలహాలు తీసుకుంటామని తెలిపారు. బీసీ ముసాయిదా రక్షణ చట్టం జాతీయ బీసీ కమిషన్ దృష్టికి తీసుకెళతామని, అక్కడ అనుమతి రాగానే అసెంబ్లీలో ఆమోదానికి ప్రవేశపెడతామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో వీలైనంత త్వరగా బీసీ రక్షణ అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. విజయవాడలోని మురళీ ఫార్చ్యూన్ హోటల్ లో బీసీ ముసాయిదా రక్షణ చట్టంపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆధ్వర్యంలో

బీసీ సామాజిక వర్గానికి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో బుధవారం కీలక సమావేశం జరిగింది. సమావేశ అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రులు మాట్లాడారు. ముందుగా మంత్రి సవిత సవిత మాట్లాడుతూ.. ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు బీసీ రక్షణ చట్టాన్ని కూటమి ప్రభుత్వం తీసుకొస్తోందన్నారు. బీసీలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక గుర్తింపే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. బీసీలను వేధించినా, జాతి, కుల వృత్తుల పేరుతో దూషించినా బీసీ రక్షణ చట్టం కింద శిక్షార్హులున్నారు. బీసీ రక్షణ చట్టం కేసుల్లో సత్వర పరిష్కారానికి ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. దేశంలోనే మొట్టమొదటి సారిగా ఏపీలోనే బీసీ రక్షణ చట్టాన్ని రూపొందిస్తున్నామన్నారు. సమావేశంలో ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందజేసిన సలహాలు సూచనలను ఇప్పటికే రూపొందించిన బీసీ ముసాయిదా రక్షణ చట్టం బిల్లులో పొందుపరుస్తామన్నారు. త్వరలో జిల్లాల్లోనూ బీసీ సంఘాల ప్రతినిధుల అభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకుంటామన్నారు. తుది నివేదికను త్వరలో జాతీయ బీసీ కమిషన్ కు అందజేస్తామన్నారు. బీసీ కమిషన్ నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే, అసెంబ్లీలో ఆమోదానికి బీసీ రక్షణ చట్టాన్ని సభలో ప్రవేశపెడతామన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో బీసీ రక్షణ చట్టం అమలుకు కృషి చేస్తామని మంత్రి సవిత వెల్లడించారు. బీసీల అభ్యున్నతే లక్ష్యంగా అన్న ఎన్టీఆర్ పార్టీ ని స్థాపించారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ సైతం బీసీలను అన్ని రంగాల్లో ముందంజలో ఉంచేలా వెన్నుదన్నుగా నిలుస్తున్నారన్నారు. బీసీలు సమాజానికి బ్యాక్ బోన్లు అని వ్యక్తులు సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ అని మంత్రి సవిత తెలిపారు.

**బీసీలను వేధించిన గత ప్రభుత్వం: మంత్రి అచ్చెన్నాయుడు**

బీసీ రక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. మా పార్టీ ఆవిర్భావం నుంచి బీసీలు అండగా ఉంటూ వస్తున్నారన్నారు. వారు కుల వివక్షకు గురికాకుండా ఉండాలని భావించి బీసీ రక్షణ చట్టానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. దేశంలో ఎన్నో చట్టాలున్నా బీసీల రక్షణకు చట్టం లేదన్నారు. గత ప్రభుత్వ మధ్య పాలనలో బీసీలు తీవ్ర అన్యాయానికి గురయ్యారన్నారు. మంత్రి నారా లోకేశ్ పాదయాత్ర సమయంలో బీసీలు తమ కష్టాలను ఆయన దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఆనాడే బీసీ రక్షణ చట్టం తీసుకొస్తామని మంత్రి నారా లోకేశ్ ప్రకటించిన విషయాన్ని మంత్రి అచ్చెన్నాయుడు గుర్తుచేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ బీసీ రక్షణచట్టాన్ని తీసుకొస్తున్నామన్నారు. రెండేళ్ల నుంచి బీసీ రక్షణ చట్టం గురించి చర్చిస్తూ వస్తున్నామన్నారు. శాసనసభలో డ్రాఫ్ట్ బిల్లు ఆమోదించే ముందే కేంద్ర జాతీయ బీసీ కమిషన్ సలహాలు కూడా తీసుకుంటామన్నారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత అన్న ఎన్టీఆర్ దేనన్నారు. ఆ రిజర్వేషన్లను 27 శాతానికి సీఎం చంద్రబాబునాయుడు పెంచారన్నారు. ప్రభుత్వం మారాక గత ప్రభుత్వం లో బలహీన వర్గాలపై కక్ష కట్టి రిజర్వేషన్లు తగ్గించారని మండిపడ్డారు. న్యాయస్థానాలు చెప్పాయని బీసీ రిజర్వేషన్లను తగ్గించేశారని, కాని, పైకోర్టుకు వెళ్లి గత ప్రభుత్వం న్యాయ పోరాటం చేయలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే, రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో డెడికేటెడ్ బీసీ కమిషన్ వేశామన్నారు.బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచేలా కృషి చేస్తామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

అంతకుముందు మంత్రి సవిత నేతృత్వంలో జరిగిన సమావేశంలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ అభిప్రాయాలను తెలియజేశారు. బీసీ రక్షణ చట్టం పటిష్టంగా ఉండేలా రూపొందించాలని సూచించారు. బీసీలను వృత్తులపరంగా, కులాల పరంగా దూషించుకుండా ఉండేలా చట్టం అమలు చేయడంతో పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశం లో మంత్రులు అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి, కొల్లు రవీంద్ర, కొండపల్లి శ్రీనివాస్, న్యాయ శాఖ మంత్రి ఎన్ ఎండీ ఫరూక్, ప్రభుత్వ విప్ లు కాల్వ శ్రీనివాసులు, బొమ్మిడి నాయకర్, పలువురు ఎమ్మెల్యేలు గుమ్మనూరు జయరాం, గల్లా మాధవి, కాగితపు కృష్ణప్రసాద్, పితాని సత్యనారాయణ, గొతు శిరీషా, చదలవాడ అరవింద బాబు, కూన రవికుమార్, కందికుంట వెంకటప్రసాద్, బొగ్గు రమణమూర్తి, గోండు శంకర్, మామిడి గోవిందరావు సహా ఇతర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, గాదె శ్రీనివాసులు నాయుడు, బీద రవిచంద్రయాదవ్, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జున, అడిషనల్ డైరెక్టర్ డి. చంద్రశేఖర్ రాజు, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ జి. భీమ్ శంకర్ రావు, పలువురు న్యాయనిపుణులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. వర్చువల్ లో మంత్రులు సత్యకుమార్ యాదవ్, అనిత, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య, బీద మస్తాన్ రావు, ఎమ్మెల్యే లోకం నాగమాధవి పాల్గొని పలు సలహాలు సూచనలు అందజేశారు.

# గర్భిణీ స్త్రీలకు సామూహిక శ్రీమంతాలు

**కాట్రేనికోన, ఆగష్టు 5(మనం ప్రతినిధి):** కాట్రేనికోన మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ముమ్మిడివరం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు సామూహిక శ్రీమంతాలను నిర్వహించారు. కాట్రేనికోనలో ముమ్మిడివరం మహిళ శిశు సంక్షేమ శాఖ సిడిపిఓ ముదునూరి నిహారిక అధ్యక్షతన జరిగిన తల్లిపాల వారోత్సవాలు, సామూహిక శ్రీమంతాలకు ఎంపీడిఓ రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లి పాలు అవశ్యకతపై మహిళా శిశు సంక్షేమ శాఖ అంగన్ వాడీ కేంద్రాల ద్వారా ప్రతి ఏటా తల్లి పాల వారోత్సవాలను ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. అంగన్ వాడీ కేంద్రాల పరిధిలో చిన్నారులకు, కౌమార బాలికలకు, గర్భవతులు, బాలింతలకు ఫౌష్టికాహారంను అందజేస్తున్నారు. సీడిపిఓ నిహారిక మాట్లాడుతూ తల్లి ముర్రు పాలును బిడ్డకు పట్టించడం ఆరోగ్య వంతమైన బిడ్డకు జన్మనిస్తుందన్నారు. ఎం ఈ ఓ కృష్ణ మోహన్ మాట్లాడుతూ బాలికలకు తెలిసీ తెలియని వయస్సులో బాల్యవివాహాలు చేయడంతో వస్తున్న టీనేజ్ ప్రెగ్నెన్సీతో తల్లి బిడ్డల ఆరోగ్యం ప్రమాదకరమన్నారు. ఈకార్యక్రమంలో అంగన్ వాడీ సూపర్ వైజర్లు తులసి, ఎల్వి రమణి, అంగన్ వాడీ కార్యకర్తలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# శంఖవరం సంత మార్కెట్ల దుకాణాల డిపాజిట్లు గల్లంతు

- నేటికీ అరకోరాగానే పంచాయితీ ఖాతాలో జమ...
- మూడు దుకాణాలకు సంబంధించిన రూ. 3,35,000లు ఎవరి జేబులో ఉందో
- పంచాయతీ కార్యదర్శే జవాబుదారీగా ప్రజలకు వెల్లడించాలి

**శంఖవరం ఆగస్టు 05 మనం ప్రతినిధి:** శంఖవరం సంత మార్కెట్లో దుకాణాలు నిర్మాణాలు చేపట్టి మూడో ఏడాది కావస్తున్న ఇప్పటికీ డిపాజిట్లు అరకోరగానే పంచాయతీ ఖాతాలో జమ చేస్తున్నట్లు సామాజిక ఉద్యమ నేత గ్రామ అభివృద్ధి సేవా సంఘం అధ్యక్షుడు మేకల కృష్ణ ఆరోపించారు. మండల కేంద్రమైన శంకవరం గ్రామంలో గల మేకల కృష్ణ స్వయ గృహంలో బుధవారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు.

శంఖవరం సంత మార్కెట్లో రూ.1,50,000 ల ధరావత్తు చెల్లింపుతో నెలసరి అద్దెకు ఇచ్చేందుకు 7 దుకాణాలూ, రూ.75,000 ల ధరావత్తు చెల్లింపుతో నెలసరి అద్దెకు ఇచ్చేందుకు 15 దుకాణాలూ చొప్పున మొత్తం 22 దుకాణాల సముదాయాన్ని (షాపింగ్ కాంప్లెక్స్)ను 2023 లో నిర్మించారు. ఈ దుకాణాలను వేలం పాటలో అద్దెకు తీసుకునే ఆసక్తి పరులైన మొత్తం 22 మంది వర్తకుల నుంచి నిర్మాణ సమయంలోనే పంచాయతీ పేరు చెప్పి రూ.21,000,00లను మధ్య దళారీలు వసూలు చేసి, వాటికి రసీదులు ఇవ్వకుండా, పంచాయితీకి కూడా జమ చేయకుండా స్వాహా చేసేశారు. ఇదంతా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో జరిగింది. తర్వాత జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్.డి.ఎ) ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జనసేన గ్రామ పార్టీ అధ్యక్షుడుగా కూడా ఉన్న మేకల కృష్ణ పూనుకుని స్వాహా అయిన రూ.21,000,00 లను తిరిగి దళారుల నుంచి పంచాయతీకి రాబట్టేందుకు పట్టు విడువని విక్రమార్కుడిలా పట్టుదలతో ప్రయత్నిస్తున్నారు. ఐతే పంచాయతీ మెదలుకొని జిల్లా స్థాయి అధికారులు వరకూ ఆయన్ని ఎవరూ ఖాతరు చేయలేదు. దీంతో ఆయన సమాచార హక్కు చట్టం ప్రచార కార్యకర్తగా చట్టబద్ధంగా ఆర్జీలను ప్రయోగించారు. అయినా కూడా పంచాయతీ సమాచారం ఇవ్వలేదు. దీంతో కృష్ణ అప్పీలేట్ అధారిటీ అయిన ఎంపీడీఓకి ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు కృష్ణకు పంచాయతీ సమాచారం ఇవ్వక తప్పలేదు. ఐతే సమాచారం ఇచ్చే ముందే మధ్య దళారీలు స్వాహా చేసిన రూ. 21,000,00 ల సొమ్ముల్లో నుంచి రూ.17,65,000 పంచాయతీకి తిరిగి రాబట్టింది. వాటిని శంఖవరం భారతీయ స్టేట్ బ్యాంకు ద్వారా ప్రత్తిపాడు ప్రభుత్వ కోశాగారానికి పంచాయతీ కార్యదర్శి కూసిరెడ్డి అప్పలరాజు పేరున ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి వివిధ తేదీల్లో బట్వాడా చేసారు. పంచాయతీ కార్యదర్శి సమాచార హక్కు చట్టం ప్రకారం మేకల కృష్ణకు ఇచ్చిన సమాచారంలో మొత్తం 22 దుకాణాల నుంచి దుకాణాల వేలంపాట బయానాలను వసూలు చేసినట్టు సమాచారం ఇచ్చారు. వాస్తవానికి 19 దుకాణాలకే రూ.17,65,000 లను వసూలు చేసినట్టు సమాచారం దృవీకరిస్తోంది. 22 దుకాణాల వరుస క్రమంలో 15, 16, 20 సంఖ్యల దుకాణాల వివరాలను ఇవ్వకుండా మసిపూసి మారేడు కాయచేసి ఇచ్చినట్టు పంచాయతీ కార్యదర్శి అప్పలరాజు లిఖితపూర్వకంగా ఓ అద్భుతం చేసారు. ఈ మూడు దుకాణాలకు సంబంధించిన రూ. 3,35,000లు ఇంకా వసూలు కావాల్సి ఉంది. ఇది ఎవరి జేబులో ఉందో రూ.17,65,000లను వసూలు చేసిన పంచాయతీ కార్యదర్శే జవాబుదారీగా ప్రజలకు వెల్లడించాల్సి ఉందని మేకల కృష్ణ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉప అధ్యక్షులు గునపర్తి అపురూప్, కార్యదర్శి పర్వత రామకృష్ణ, సహాయ కార్యదర్శి పగడాల సన్యాసరావు, కోశాధికారి గుద్దాటి నాగేశ్వరావు, కమిటీ సభ్యులు బొర్రా వీర వేంకట రమణ,బొమ్మిడి సత్యనారాయణ, రేలంగి వెంకట సత్యనారాయణ, పడాల కృష్ణ, మొగిలి శ్రీను, ములికి అప్పారావు,కొంగు రమేష్, బత్తిన తాతాజీ, కానేటి వెంకటరమణ, గునపర్తి రాఘవ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక బకాయిల చెల్లింపులో అలసత్వం తగదు: ఫ్యాప్టో చైర్మన్

**కాట్రేనికోన ఆగష్టు 5(మనం ప్రతినిధి):** బుధవారం కాట్రేనికోన మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలలను సందర్శించిన ఫ్యాప్టో చైర్మన్ మరియు ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లంకలపల్లి సాయి శ్రీనివాస్ ఉపాధ్యాయులు మరియు విద్యా రంగానికి సంబంధించిన సమస్యలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు..ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు వేల కోట్లలో పేరుకుపోయిందని, వీటిని ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్లో ఉన్న నాలుగు డి.ఏ.లు, సరెండర్ లీవ్ బకాయిలు, మరియు 11వ పిఆర్సి బకాయిలు తక్షణమే విడుదల చేయాలని కోరారు. అంతేకాకుండా, 12వ పిఆర్సి కమిటీని వెంటనే నియమించి, 30శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని గట్టిగా హెచ్చరించారు. సిలబస్ పూర్తి కాకుండానే విద్యార్థులపై 'మిషన్ మార్చ్' స్లిప్ టెస్ట్ పరీక్షలు నిర్వహించడం అశాస్త్రీయమని, నవంబర్ వరకు పూర్తిగా బోధన చేయడానికి విద్యార్థులకు సమయం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు..ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్ టి యు వైస్ ప్రెసిడెంట్ ఎస్.ఎస్. పల్లంరాజు, రాష్ట్ర కన్వీనర్ అయితాబత్తుల వర్మ, సీనియర్ నాయకులు వి. పళ్ళారావు, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విత్తనాల నరసింహ మూర్తి, శ్రీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీల సంక్షేమానికి మరింత బలమైన చట్టం

## బీసీ ప్రజాప్రతినిధులతో మంత్రి సవిత కీలక సమావేశం..

## బీసీ చట్ట ముసాయిదా7పై మంత్రి అచ్చెన్నాయుడు సూచనలు

**అమరావతి/ విశాఖపట్నం , ఆగస్టు 5:** రాష్ట్రంలో బీసీల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, సామాజిక న్యాయానికి మరింత బలమైన చట్టాన్ని తీసుకురావాలనే లక్ష్యంతో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అధ్యక్షతన బీసీ ప్రజాప్రతినిధులతో విజయవాడలోని ఫార్చ్యూన్ మురళి హోటల్లో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పాల్గొని బీసీ చట్ట ముసాయిదాపై పలు విలువైన సూచనలు చేశారు. బీసీ వర్గాల ఆకాంక్షలకు అనుగుణంగా చట్టాన్ని మరింత సమగ్రంగా, పారదర్శకంగా రూపొందించేందుకు ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు, సూచనలను సమావేశంలో విస్తృతంగా చర్చించారు. చట్టం ద్వారా బీసీలకు మరింత రక్షణ, అభివృద్ధి అవకాశాలు కల్పించే అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, బీసీల సామాజిక, ఆర్థిక, విద్యా అభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

బీసీ వర్గాల సంక్షేమం కోసం తీసుకువస్తున్న చట్టం ఆదర్శవంతంగా ఉండేలా ప్రభుత్వం అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటోందని తెలిపారు. బీసీల సాధికారతకు ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, వారి హక్కులను మరింత బలోపేతం చేసేలా చట్టానికి తుది రూపు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

# ఉప్పరాహాల్ గ్రామంలో డోర్ టూ డోర్ టీడీపీ కార్యక్రమం

**కౌతాళం, ఆగస్టు 5(మనం న్యూస్):** కుటామి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు అయిన సందర్భంగా డోర్ టు డోర్ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మరియు యువ నాయకులు నారా లోకేష్ మరియు టిడిపి మంత్రాలయం ఇంచార్జ్ రాఘవేంద్ర రెడ్డి మరియు జిల్లా ఉపాధ్యక్షులు చూడి ఉలిగయ్య మరియు కౌతాళం మండలం అధ్యక్షుడు సురేష్ నాయుడు ఆదేశాల మేరకు ప్రభుత్వం చేపట్టిన డోర్ టు డోర్ కార్యక్రమాన్ని బుధవారం రోజున ఉప్పరహాల్ గ్రామంలో 175 బూత్ లో డోర్ 2 డోర్ కార్యక్రమనికి 100 శాతం పూర్తి చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి అధ్యక్షుడు ఈరన్న,తెలుగు తమ్ముళ్లు కరియప్ప,బీరుమల్ల,యువ నాయకులు రంగస్వామి,సురేష్, వీరేష్,అయ్యప్ప, అనంత్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

# నడకకే ముప్పు తెస్తున్న నిర్లక్ష్యం.. పాదాల సంరక్షణలో ఆధునిక వైద్య అద్భుతాలు!

- మడమ, పాదం నొప్పుల పట్ల నిరంతర అప్రమత్తత అవసరం
- ఏమాత్రం అలసత్వం వహించినా నడవలేని దుస్థితి
- మధుమేహ బాధితులకు పొంచి ఉన్న తీవ్ర ప్రమాదం
- వైద్యరంగంలో విప్లవాత్మక త్రీడీ ప్రింటింగ్ సాంకేతికత
- చిన్నపాటి రంధ్రాలతోనే సంక్లిష్ట శస్త్రచికిత్సలు
- ఆపరేషన్ తర్వాత వేగంగా కోలుకునే వెసులుబాటు
- క్రీడాకారుల పాలిట వరంగా సరికొత్త పునరావాస పద్ధతులు
- వివరాలు వెల్లడించిన యశోద ఆసుపత్రి వైద్యులు ఆదిత్య సోమయాజి

**కాకినాడ ఆగష్టు 5 మనం న్యూస్:** వయసు పైబడటం వల్లే పాదం, మడమ నొప్పులు వస్తున్నాయనే భ్రమలో చాలామంది కాలయాపన చేస్తుంటారు. కానీ, భరించరాని స్థాయికి నొప్పి చేరేదాకా వేచిచూడటం ఏమాత్రం సురక్షితం కాదు. తరచుగా కాలు బెణకడం, పాదాల ఆకృతి దెబ్బతినడం, ఆటల్లో తగిలే గాయాలు, మరీ ముఖ్యంగా మధుమేహం వల్ల తలెత్తే సమస్యలను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో శాశ్వత వైకల్యం బారినపడే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వ్యాధి లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తించి వైద్యులను సంప్రదిస్తే పెనుముప్పును సులభంగా నివారించవచ్చు. వైద్యవిజ్ఞానం సాధించిన ప్రగతితో పాదం, మడమ చికిత్సల్లో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. అధునాతన స్కానింగ్ విధానాలతో వ్యాధి మూలాలను కచ్చితంగా పసిగట్టి, అత్యుత్తమ వైద్యం అందించే సాంకేతికత ప్రస్తుతం అందుబాటులోకి వచ్చింది. పాత పద్ధతులకు స్వస్తి పలుకుతూ, పెద్ద కోతలు లేకుండానే ఆపరేషన్లు విజయవంతంగా పూర్తి చేస్తున్నారు. ఫలితంగా బాధితులు తీవ్రమైన నొప్పికి గురికాకుండానే అతి త్వరగా కోలుకుని తమ దైనందిన పనుల్లోకి అడుగుపెడుతున్నారు. సంక్లిష్టమైన ఎముకల విరుగుళ్లు, ఎముకల లోపాలను సైతం ఆధునిక త్రీడీ ప్రింటింగ్ పరిజ్ఞానం, అత్యుత్తమ నాణ్యత గల ఇంప్లాంట్ల ద్వారా సమర్థంగా నయం చేస్తున్నారు. అవసరమైన వారికి మడమ కీలు మార్పిడి చేసి వారి నడకను తిరిగి గాడిలో పెడుతున్నారు.

ఆధునిక ఫిజియోథెరపీ, పునరావాస చికిత్సల అండతో క్రీడాకారులు, ఉద్యోగులు అతి తక్కువ వ్యవధిలోనే తమ విధులకు హాజరవుతున్నారు. నాణ్యమైన పాదరక్షలు వాడటం, మధుమేహ బాధితులు రోజూ తమ పాదాలను నిశితంగా గమనించుకోవడం ద్వారా అనర్థాలను సమర్థవంతంగా అడ్డుకోవచ్చు. ఫుట్ అండ్ యాంకిల్ విభాగంలో విశేష అనుభవం గడించి, అధునాతన చికిత్సలు అందిస్తున్న హైటెక్ సిటీ యశోద ఆసుపత్రి సీనియర్ కన్సల్టెంట్, ఆర్థోపెడిక్, జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ ఆదిత్య సోమయాజి ఎంతోమంది రోగులకు తిరిగి నడక భాగ్యాన్ని ప్రసాదిస్తున్నారు. ఆరోగ్యకరమైన పాదాలే చురుకైన జీవనానికి ఆధారమని ఆదిత్య సోమయాజి స్పష్టం చేస్తున్నారు. ఈ వైద్యపరమైన వివరాలను హైటెక్ సిటీ యశోద ఆసుపత్రి సీనియర్ ఎగ్జిక్యూటివ్ వి. సాయికిరణ్ పత్రికా ముఖంగా వెల్లడించారు.

# గడియారం ఆస్పత్రిని ప్రారంభించిన మంత్రి

**కర్నూలు ఆగస్ట్ 05మనం న్యూస్:** కర్నూలు నగరంలోని పాత బస్తీలో ఉన్న గడియారం ఆస్పత్రిని మంత్రి టీజీ భరత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన గడియారం ఆసుపత్రిని మళ్లీ ప్రారంభించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇందులో భాగమైన క్రెడాయ్ సభ్యులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల పనితీరు, నాయకుల కృషితో ఇది సాధ్యమైందన్నారు. రానున్న రోజుల్లో హైకోర్టు బెంచ్ రాకతో నగరం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. ఇక ఓర్వకల్లు పారిశ్రామికవాడలో ఎన్నో పరిశ్రమలు వస్తున్నాయన్నారు. రూ.50 వేల కోట్లు పెట్టుబడులు వస్తాయన్నారు. ప్రజలు కులం, మతం చూడకుండా అభివృద్ధి చేసేది ఎవరో చూడాలన్నారు. తాము అందరిని గౌరవిస్తామన్నారు. గడియారం ఆస్పత్రి నుండి కొండారెడ్డి బురుజు వరకు వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసేందుకు ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు. నగరాన్ని స్మార్ట్ సిటీ తరహాలో తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు.

# పార్టీ పల్స్ కార్యాలయంలో జర్నలిస్టులను కలిసిన వెల్డింగ్ ఇన్స్టిట్యూషన్స్ అసోసియేషన్ ప్రతినిధులు

**విశాఖపట్నం, ఆగస్టు 5:** వెల్డింగ్ రంగ అభివృద్ధి, నైపుణ్య శిక్షణకు ప్రాధాన్యం కల్పిస్తూ సేవలందిస్తున్న వెల్డింగ్ ఇన్స్టిట్యూషన్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం బుధవారం పార్టీ పల్స్ కార్యాలయంలో పలువురు సీనియర్ జర్నలిస్టులను మర్యాదపూర్వకంగా కలుసుకుంది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు కరణం కనకారావు, జనరల్ సెక్రటరీ చట్టి వెంకట రమణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ అంజి బాబు, కార్యవర్గ సభ్యుడు ఆర్.టి. నాయుడు మీడియా ప్రతినిధులతో సమావేశమై సంఘం లక్ష్యాలు, భవిష్యత్ కార్యాచరణపై వివరించారు.

అధ్యక్షుడు కరణం కనకారావు మాట్లాడుతూ, సమాజానికి వాస్తవ సమాచారాన్ని చేరవేయడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని, మీడియా ప్రతినిధులు తమ సంఘానికి ఎల్లప్పుడూ సన్నిహితులేనని పేర్కొన్నారు. వెల్డింగ్ రంగానికి సంబంధించిన అవగాహన కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరవేయడంలో మీడియా సహకారం ఎంతో అవసరమని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులు తిలక్ (మనం న్యూస్), బాషా (ఇన్నర్ వ్యూ), పవన్ (స్ట్రీ న్యూస్ ఎక్స్ప్రెస్), ₹₹దివాకర్ (దళిత వాయిస్)₹₹లను అసోసియేషన్ ప్రతినిధులు శాలువాలతో ఘనంగా సత్కరించి, వారి పాత్రను అభినందించారు. జర్నలిస్టులు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, వెల్డింగ్ రంగ అభివృద్ధి, నైపుణ్య శిక్షణకు సంబంధించిన ప్రజా ప్రయోజన కార్యక్రమాలకు మీడియా తరపున సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెల్డింగ్ ఇన్స్టిట్యూషన్స్ అసోసియేషన్ సభ్యులు, శిక్షణా సంస్థల ప్రతినిధులు, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మంచం పట్టిన గోవాడ బి.సి. బాలుర వసతి గృహం!?

- గోవాడ వసతి గృహంలో మెనూ సక్రమంగా లేదంటున్న విద్యార్థులు, తల్లిదండ్రులు!??,

**అనకాపల్లి చోడవరం ఆగస్టు 5 మనం న్యూస్:** అనకాపల్లి జిల్లా చోడవరం మండలంలోని గోవాడ బి.సి. ప్రభుత్వ వసతి గ్రహంలో విద్యార్థులకు అందించాల్సిన మెనూ సక్రమంగా అమలు చేయకపోవడంతో విద్యార్థులు తరచూ అనారోగ్యం బారిన పడుతున్నారని తల్లి తండ్రులు ఆరోపిస్తున్నారు. విద్యార్థలకు అందించే పౌష్టికాహారం లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సహించేది లేదని రాష్ట్ర ఆహార కమీషన్ సభ్యుడు ఈ లక్ష్మీరెడ్డి హెచ్చరించి, 24 గంటలు గడవక ముందే ఆహార లేమి తో 8 వ తరగతి విద్యార్థి పండ శివ కుమార్ అనారోగ్యంతో ఆసుపత్రి పాలయ్యాడు. జాతీయ ఆహార భద్రత చట్టం 2013 ప్రకారం ప్రతీ లబ్ధిదారుడికి నాణ్యమైన ఆహారాన్ని అందించేలా అధికారులు భాధ్యత తీసుకోవాలన్నారు. వసతి గృహాల్లో విద్యార్థులకు అందించే మెనూ సక్రమంగా అమలు చేయని అధికారులు పై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లి తండ్రులు, ప్రజా సంఘాలు వారు డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థులకు అందాల్సిన పౌష్టికాహారం పక్కతోవ పడుతోందని పేరెంట్స్ కమిటీ ఆరోపిస్తోంది. మూడు వసతిగృహాలకు ఒకరే సంక్షేమాధికారి కావడంతో, ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళ్తారో కూడా తెలియదని స్థానికులు విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. విద్యార్థి అనారోగ్యానికి కారణమైన గోవాడ బిసి వసతి గృహ సంక్షేమ అధికారిపై తక్షణమే చర్యలు తీసుకోవాల్సిందిగా తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

# డ్రగ్స్ వద్దు బ్రో'తో విద్యార్థుల్లో చైతన్యం

- ఈగల్ పల్లెబాట కార్యక్రమంలో మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన
- 1972 టోల్ఫ్రీ నంబర్కు సమాచారం ఇవ్వాలని ఈగల్ అధికారుల పిలుపు
- విద్యార్థి దశ నుంచే మత్తు వ్యసనాలపై అప్రమత్తత అవసరమని ప్రిన్సిపాల్ రమేష్బాబు
- ఈగల్ పల్లెబాట కార్యక్రమంలో ఆపరేషన్ చైతన్యం, గరుడపై వివరాలు
- సురక్షిత క్యాంపస్ – మత్తు రహిత సమాజమే లక్ష్యమని అధికారుల సందేశం
- డ్రగ్స్కు 'నో' చెప్పి మంచి భవిష్యత్తుకు బాటలు వేయాలని పిలుపు
- యువతను మత్తు వ్యసనాల బారిన పడకుండా చైతన్యపరిచిన ఈగల్ బృందం

**పోలవరం జిల్లా (చింతూరు, మనం న్యూస్)ఆగస్టు 5:** చింతూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం డ్రగ్స్ వద్దు బ్రో పేరుతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర పోలీసు శాఖ చేపట్టిన ఈగల్ పల్లెబాట కార్యక్రమంలో భాగంగా, ఐజీపీ ఆకే రవికృష్ణ, ఐపీఎస్, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలవరం జిల్లా ఈగల్ విభాగం, తూర్పుగోదావరి జిల్లా ఈగల్ బృందం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆపరేషన్ చైతన్యం, ఆపరేషన్ గరుడ, ఆపరేషన్ ఈగల్ ఆన్ ట్రైన్స్, సేఫ్ క్యాంపస్ జోన్, వజ్ర ప్రహార్ తదితర కార్యక్రమాల లక్ష్యాలను అధికారులు వివరించారు. ముఖ్యంగా గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన అనుమానాస్పద కదలికలు కనిపిస్తే వెంటనే 1972 టోల్ఫ్రీ నంబర్కు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఈగల్ పోలవరం జిల్లా ఇన్స్పెక్టర్ పి.వి. సూర్యమోహన్రావు, హెడ్ కానిస్టేబుళ్లు మధు, వీరబాబు, వెంకటేష్ పాల్గొని విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి మాదకద్రవ్యాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె. రమేష్బాబు మాట్లాడుతూ, 'విద్యార్థి దశ నుంచే మాదకద్రవ్యాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి. యవ్వనంలో చెడు అలవాట్లకు దూరంగా ఉండి, చదువు, క్రమశిక్షణ, మంచి లక్ష్యాలతో ముందుకు సాగితేనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుంది' అని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు భరత్, గణేష్, దుర్గాప్రసాద్, భూలక్ష్మి, అప్పలనాయుడు, సుశీల, రాము, శివ, చంద్రశేఖర్తో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## గొల్లపల్లి వెంకటేష్ కుటుంబాన్ని పరామర్శించిన తుమ్మలపల్లి రమేష్

**కిర్లంపూడి ఆగష్టు 05:( మనం న్యూస్ ):** జగ్గంపేట నియోజకవర్గం కిర్లంపూడి మండలం సోమవరం గ్రామానికి చెందిన గొల్లపల్లి వెంకటేష్ ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని జగ్గంపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ అన్నారు. సోమవరం గ్రామంలో వెంకటేష్ స్వగృహంలో నిర్వహించిన దశదినకర్మ కార్యక్రమానికి తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు. దివంగత వెంకటేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పారంశెట్టి సూర్యచంద్ర, మత్స తిరుపతి రాయుడు, ఏనుగుపల్లి శ్రీను, మాదారపు వీరబాబు, పారంశెట్టి రమేష్తో పాటు పలువురు జనసేన నాయకులు, జనసైనికులు, వీర మహిళలు, గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొని వెంకటేష్కు నివాళులర్పించారు.

## ప్రజల ఆదరణే ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం

- తెదేపా ఇంచార్జ్ పొత్తూరి రామరాజు

**నరసాపురం, ఆగస్టు 5 (మనం న్యూస్) :** పేద, మధ్య తరగతి కుటుంబాల అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రజలు ఇచ్చిన ప్రతి హామీని దశల వారీగా అమలు చేస్తూ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రభుత్వ పాలనను ముందుకు తీసుకు వెళ్తున్నామని నరసాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని15వ వార్డు పీచుపాలెంలో నిర్వహించిన రెండేళ్ల నమ్మకం - డోర్ టు డోర్ కార్యక్రమంలో పొత్తూరి రామరాజు ముఖ్య అతిథిగా పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ సూపర్ సిక్స్ సూపర్ హిట్ అంటూ ప్రజలు అందిస్తున్న అపూర్వ ఆదరణే ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని అన్నారు. ప్రజల ఆశీర్వాదం, విశ్వాసం తమ బాధ్యతను మరింత పెంచిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకం నిజమైన అర్హులకు చేరేలా కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. పేద, మధ్యత, ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వారి సమస్యలను నేరుగా తెలుసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నామని వెల్లడించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం తమ బాధ్యతగా భావిస్తూ ప్రతి ఇంటికి, ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు చేరే వరకు నిరంతరం శ్రమిస్తామని రామరాజు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు, ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్, తెదేపా అధ్యక్షుడు వాతాడి ఉమామహేశ్వర రావు, షేక్ హుస్సేన్, బొమ్మిడి వెంకట రమణ, బొమ్మిడి అర్జునరావు, రమణ తదితర నాయకులు పాల్గొన్నారు.

## స్వదేశానికి తిరిగి వచ్చిన పాస్టర్లను సన్మానించిన మండల ఫెలోషిప్ సభ్యులు

**ఏలేశ్వరం,ఆగస్టు 05(మనం న్యూస్):**ఇటీవల విదేశాలకు వెళ్లి ఏసుక్రీస్తు సువార్తలను బోధించి స్వదేశానికి తిరిగి వచ్చిన మిరాకిల్ మినిస్ట్రీస్ అధినేత పాస్టర్ పి ప్రవీణ్ పాల్,దేవుని పరిశుద్ధ మందిరం పాస్టర్ జాన్ పెన్ని బాబు ను ఏలేశ్వరం మండల పాస్టర్ ఫెలోషిప్ సభ్యులు ఏలేశ్వరం లింగవరం కాలనీలో ఫెలోషిప్ జాయింట్ సెక్రెటరీ పాస్టర్ పల్లి నెల్సన్ కల్వరి మందిరంలో నిర్వహించబడిన మండల పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశంలో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మండల పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు కుంపట్ల పాల్ ప్రసాద్ ,గౌరవ అధ్యక్షుడు జాన్ విల్సన్ బాబు,ఫౌండర్ ఎస్ ఎలైజా,సెక్రెటరీ ఏబీవీ ప్రసాద్ వైస్ ప్రెసిడెంట్ పిప్రకాష్ పాల్,ట్రెజరర్ వాస సామ్యూల్, జాయింట్ సెక్రెటరీ పల్లి నెల్సన్, కూసి మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నరసాపురం-విశాఖపట్నం రెగ్యులర్ ట్రైన్పునరుద్ధరణ చేయాలని కేంద్ర మంత్రికి వినతి

**పాలకొల్లు, ఆగష్టు 5,మనం ప్రతినిధి :** ఉభయ గోదావరి జిల్లాల ప్రజలకు విద్య, వైద్య, వ్యాపార అవసరాలకు విశాఖపట్నంతో ప్రత్యక్ష రైలు అనుసంధానం ఎంతో అవసరం' అని నరసాపురం-విశాఖపట్నం రెగ్యులర్ ట్రైన్ పునరుద్ధరణ గచేయాలని కేంద్ర మంత్రివర్యులు శ్రీ భూపతిరాజు శ్రీనివాస్ వర్మకు పలువురు బీజేపీ నేతలు వినతి పత్రం అందజేశారు.సమర్పించిన ప్రధాన డిమాండ్లు గోదావరి జిల్లాల ప్రజల సౌకర్యార్థం ఈ క్రింది డిమాండ్లను మంత్రి కి సమర్పించారు . ప్రత్యామ్నాయంగా సింహాద్రి ఎక్స్ప్రెస్ ను భీమవరం టౌన్ మీదుగా డైవర్ట్ చేయాలి. దీనివల్ల లక్షలాది మంది ప్రయాణికులకు లాభం, రైల్వే రద్దీ కూడా తగ్గుతుంది.మూడవది ఏటా వేలాది మంది వెళ్లే కాశి-అయోధ్య యాత్రకు నరసాపురం నుండి డైరెక్ట్ ఎక్స్ప్రెస్₹ నడపాలి. దీనితో పాటు మన నిమ్మ, కొబ్బరి, చేప, రొయ్యలను ఉత్తరాదికి నేరుగా పంపే అవకాశం ఉంటుంది. నాల్గవది ₹గోదావరి జిల్లాల్లోని రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ₹చేపట్టాలి. ఈ వినతిపత్రాన్ని₹ కేంద్ర మంత్రివర్యులు భూపతిరాజు శ్రీనివాస్ వర్మ తో పాటు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, రైల్వే బోర్డ్, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ మరియు విజయవాడ డి ఆర్ ఎం కి కూడా పంపించి నట్లు తెలిపారు.ఈ ప్రతినిధి బృందంలో పాల్గొన్నవారి లో సభ్యులు జక్కంపూడి లక్ష్మీనరసింహ నాగేంద్ర కుమార్, కొల్లికొండ ప్రసాద్, అడపాల శివ సురేంద్ర, అల్లూరి పద్మ, అవిన్.వున్నారు.

# ప్రజల ఆదరణే ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం



- తెదేపా ఇంచార్జ్ పొత్తూరి రామరాజు

**నరసాపురం, ఆగస్టు 5 (మనం న్యూస్) :** పేద, మధ్య తరగతి కుటుంబాల అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రజలు ఇచ్చిన ప్రతి హామీని దశల వారీగా అమలు చేస్తూ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రభుత్వ పాలనను ముందుకు తీసుకు వెళ్తున్నామని నరసాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని15వ వార్డు పీచుపాలెంలో నిర్వహించిన రెండేళ్ల నమ్మకం - డోర్ టు డోర్ కార్యక్రమంలో పొత్తూరి రామరాజు ముఖ్య అతిథిగా పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ సూపర్ సిక్స్ సూపర్ హిట్ అంటూ ప్రజలు అందిస్తున్న అపూర్వ ఆదరణే ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని అన్నారు. ప్రజల ఆశీర్వాదం, విశ్వాసం తమ బాధ్యతను మరింత పెంచిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకం నిజమైన అర్హులకు చేరేలా కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. పేద, మధ్యత, ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వారి సమస్యలను నేరుగా తెలుసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నామని వెల్లడించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం తమ బాధ్యతగా భావిస్తూ ప్రతి ఇంటికి, ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు చేరే వరకు నిరంతరం శ్రమిస్తామని రామరాజు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు, ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్, తెదేపా అధ్యక్షుడు వాతాడి ఉమామహేశ్వర రావు, షేక్ హుస్సేన్, బొమ్మిడి వెంకట రమణ, బొమ్మిడి అర్జునరావు, రమణ తదితర నాయకులు పాల్గొన్నారు.

## సత్యదేవుని నిత్య అన్నదానానికి రూ.1,00,006 విరాళం

- దాతలను అభినందించిన దేవస్థానం అధికారులు

**అన్నవరం, ఆగస్టు 5, మనం న్యూస్ :** కాకినాడ జిల్లా అన్నవరంలోని శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో భక్తుల సహకారంతో కొనసాగుతున్న నిత్య అన్నదాన పథకానికి మరో భక్తి కానుక లభించింది. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంకు చెందిన పట్నాల నాగమణి దంపతులు బుధవారం దేవస్థానానికి రూ.1,00,006 విరాళాన్ని సమర్పించారు. ఈ విరాళంపై వచ్చే వడ్డీతో తమ పేరుమీద ప్రతి సంవత్సరం నిత్య అన్నదానం నిర్వహించాలని వారు దేవస్థాన అధికారులను కోరారు. దాతల భక్తిశ్రద్ధలను అభినందించిన అన్నదానం సూపరింటెండెంట్ బలువు సత్య శ్రీనివాస్, స్వామివారి అనుగ్రహంతో వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. హిందూ సంప్రదాయంలో అన్నదానం మహాదానంగా భావిస్తారు. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం అనేది అత్యున్నత పుణ్యకార్యంగా శాస్త్రాలు పేర్కొంటాయి. అన్నవరం శ్రీ సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో భక్తులు అందించే ఇలాంటి విరాళాలు వేలాది మంది యాత్రికులకు ప్రతిరోజూ ప్రసాదరూపంలో అన్నసేవ అందించేందుకు దోహదపడుతున్నాయి. భక్తుల సేవాభావం, దాతృత్వం స్వామివారి కృపకు నిదర్శనమని ఆలయ వర్గాలు పేర్కొంటున్నాయి.



# వరి పంటకు భీమా తప్పనిసరి...

**శంఖవరం ఆగస్టు 05 మనం ప్రతినిధి:** ఖరీఫ్ పంటకాలంలో వరి సాగు చేస్తున్న రైతులు అందరూ ప్రధానమంత్రి పంట భీమా యోజన పథకంలో నమోదు చేయించుకోవాలని వ్యవసాయ అధికారి పి గాంధీ రైతులకు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా శృంగధార గ్రామంలో వరి సాగు చేస్తున్న రైతులు,కౌలు రైతులకు ప్రధానమంత్రి పంట భీమా యోజన పథకం గూర్చి ప్రస్తుత ఎల్నినో ప్రభావం వల్ల వరి సాగులో వర్షాభావ పరిస్థితులు ఉండే అవకాశం ఉన్నందున రైతులు తమకు బ్యాంకులో రుణం లేనియెడల ఎకరాకు 760 రూపాయలు ప్రీమియం చెల్లించి లబ్ది పొందాలని తెలిపారు.రైతులతో వరి

నారుమల్లను పరిశీలించి సూచనలు ఇచ్చారు.అనంతరం వేలంగిలో జాతీయ ఆహార భద్రత మరియు పోషకాహార మిషన్ లో భాగంగా శ్రీ అన్న(చిరు ధాన్యాలు)లో రాగులులో అధిక దిగుబడినిచ్చే రకాలైన ఇంద్రావతి వంటి రకాలతో ఉత్పత్తి పెంచి పౌష్టికాహారాన్ని అందించవచ్చని రైతులకు సూచించారు. వేళంగిలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో సాగు చేస్తున్న ఎ. టి .ఎం. నమూనా,వృత్తాకార నమూనాలను రైతులతో పరిశీలించి సూచనలు ఇచ్చారు. దశపర్ణి కషాయం తయారు చేసే విధానాన్ని,వాడే విధానం గూర్చి రైతులకు ప్రకృతి వ్యవసాయ ఎం టి రామరాజు వివరించారు. పంట నమోదు, జాతీయ ఎరువుల విక్రయ ఫ్రేమ్ వర్క్ యాప్ ద్వారా ఎరువుల బుకింగ్ గూర్చి రైతులకు వివరించారు.ఉద్యాన సహాయకులు ప్రసాద్,సువర్ణ రాజు,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

## రాష్ట్ర హోంమంత్రి అనిత రాజీనామా చేయాలి పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



- మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్కు భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శ

**దేవరపల్లి, ఆగస్టు 05 (మనం ప్రతినిధి):** రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దేవరపల్లి పర్యటన సందర్భంగా బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వైఎస్సార్సీపీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా పోలవరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రానికి మాజీ ముఖ్యమంత్రి అనే విషయాన్ని ప్రభుత్వం గుర్తుంచుకోవాలని అన్నారు. ఆయనకు కల్పించాల్సిన భద్రత విషయంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించారు.మాజీ ముఖ్యమంత్రికి తగిన భద్రత కల్పించడంలో ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం పూర్తిగా విఫలమయ్యాయని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, ప్రజలకు భద్రత కల్పించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని అన్నారు.రాష్ట్రంలో శాంతిభద్రతలను పరిరక్షించడంలో ప్రభుత్వం విఫలమైనందున హోంమంత్రి తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని తెల్లం బాలరాజు డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో పలువురు వైఎస్సార్సీపీ మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో భోజనం పొట్లాలు అందజేత

**ఏలేశ్వరం,ఆగస్టు, 5:-(మనం న్యూస్):** పట్టణంలోని కొంతమంది వృద్ధులకు నిరుపేదలకు బిక్షాటన చేసుకునే వారికి బత్తిన సునీత పాల్ కుమారుడు బత్తిన సునీల్ ప్రకాష్ రాయ్ ఆర్థిక సాయంతో వివేకానంద సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం భోజనం పొట్లలను అందజేశారు.ఈ సందర్భంగా సునీల్ ప్రకాష్ రాయ్ మాట్లాడుతూ వివేకానంద సేవాసమితి సభ్యులు చేస్తున్న సేవలు అమోఘమని, ఇలా భోజనం పొట్లాలను పంపిణీ చేయడం వలన మనసుకు సంతృప్తినిస్తుందని మానవసేవే మాధవసేవ అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో వివేకానంద సేవా సమితి పట్టణ ఇంచార్జ్ పెండ్యాల రాజు,దాసరి కృష్ణ,జర్నలిస్టులు రాజశేఖర్, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

# స్మార్ట్ సిటీ దిశగా కర్నూలు అభివృద్ధి.. రాష్ట్ర మంత్రి టీజీ భరత్

- ట్రాఫిక్ కష్టాలు తీర్చేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నాం
- కర్నూలు నగరంలో ఘనంగా మంత్రి టీజీ భరత్ పుట్టినరోజు వేడుకలు

**కర్నూలు ఆగస్ట్ 05మనం న్యూస్ :** విజనరీ లీడర్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కర్నూలును అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ చెప్పారు. మంత్రి టీజీ భరత్ పుట్టినరోజు వేడుకలు కర్నూలులో ఘనంగా జరిగాయి. ముందుగా ఆయన దేవాదాయశాఖ గోశాలలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బుధవారపేటలో స్థానిక నాయకులు అబ్బాస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని మంత్రి టీజీ భరత్ ప్రారంభించారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు.ఎస్.ఏ.పీ క్యాంపు రోడ్డు ప్రారంభం.బళ్ళారి చౌరస్తా వద్ద ట్రాఫిక్ను దృష్టిలో పెట్టుకొని హైదరాబాద్ నుండి వచ్చే వాహనాలు ఎస్.ఏ.పీ క్యాంపు మీదుగా కొత్త బస్టాండ్ వైపు మళ్లించేందుకు నూతనంగా ఏర్పాటుచేసిన రోడ్డును మంత్రి టీజీ భరత్ ప్రారంభించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించి అనంతరం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కర్నూలు నగరాన్ని స్మార్ట్ సిటీ చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా నగరంలో ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. కోటిన్నర రూపాయలతో ఈ రోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. ఇందుకు సహకరించిన వారందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన బర్త్డే వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు, ఆయన అభిమానులు తరలివచ్చి మంత్రికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి టీజీ భరత్ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద షేర్ షా సూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఆ తర్వాత ప్రభుత్వ ఆసుపత్రిలో 2 సంవత్సరాల కాలంలో చేసిన అభివృద్ధిని గుర్తు చేస్తూ మొక్కలు నాటారు. అనంతరం కంటి ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం సిటీ స్టోర్ మాల్లో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం చల్లా కంపౌండ్లో ఆధార్ సేవా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.

# రాష్ట్ర వ్యాప్తంగా కళాశాలల బంద్ విజయవంతం

**ఎమ్మిగనూరు ఆగస్టు 5 మనం న్యూస్:** పట్టణంలో స్థానిక కళాశాలను ఎబివిపి నాయకులు తరగతులను బహిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎబివిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోవింద్ మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యారంగ సమస్య లకు పరిష్కారం కోరుతూ బంద్ విజయవంతంగా చేపట్టడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న రూ.6,800 కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, డిగ్రీ తో సహా అన్ని కోర్సుల ప్రవేశాలను తక్షణమే పూర్తి చేసి అన్ని విశ్వ విద్యాలయాలకు ఉమ్మడి అకాడమిక్ క్యాలెండర్ ప్రకటించాలని, సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు పక్కా భవనాలు నిర్మించి విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని , ప్రభుత్వ పరీక్షల (అక్రమ పద్ధతుల నిరోధక) సవరణ బిల్లు 2026 పటిష్టంగా అమలు చేయాలని , రాష్ట్రంలోని ప్రైవేట్ మెడికల్ కళాశాలలో ' ఏ ' కేటగిరి విద్యార్థుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసే విధానాన్ని అరికట్టాలని జీవో నెంబర్ 77 రద్దుచేసి పీజీ చదివే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ చెల్లించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతులను మెరుగుపరచాలని ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని కార్పొరేట్ ప్రైవేటు విద్యా వ్యాపారాన్ని అరికట్టి పేద విద్యార్థులకు నాణ్యమైన ఉన్నతమైన విద్యను అందుబాటులో ఉంచాలని మరియు జిల్లాకు ఒక ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎబివిపి నాయకులు మారుతి, మల్లికార్జున, యశ్వంత్, విష్ణు మరియు ఖాజా తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆహారం

- సీడీపీవో పర్వత వెంకటలక్ష్మి.....
- కత్తిపూడిలో తల్లిపాల వారోత్సవాల పై అవగాహన

**శంఖవరం ఆగష్టు 05 మనం ప్రతినిధి :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం కత్తిపూడి గ్రామం లోని అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసిడిఎస్ సీడీపీవో పర్వత వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మొదటి ఆరు నెలల పాటు బిడ్డకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, తల్లిపాలే ఆహారం,తల్లిపాలే నీరు అని అవగాహన కల్పించారు.పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించడం ప్రారంభించాలని, తేనె,పశువుల పాలు,ఇతర పానీయాలు, డబ్బా పాలు ఇవ్వకూడదని సూచించారు.

బిడ్డకు అవసరమైన నీరు, పోషకాలు తల్లిపాలలోనే లభిస్తాయని వివరించారు. తల్లిపాలు బిడ్డకు శక్తిని,ఆరోగ్యాన్ని అందించడంతో పాటు తల్లికీ అనేక ప్రయోజనాలు కలిగిస్తాయని వివరించారు. పాల ఉత్పత్తికి శరీరం అదనపు కేలరీలను ఖర్చు చేయడం ద్వారా గర్భధారణ సమయంలో పెరిగిన బరువు తగ్గేందుకు దోహదపడుతుందని,కొన్ని రకాల క్యాన్సర్లు, దీర్ఘకాలిక వ్యాధుల ముప్పును తగ్గిస్తుందని తెలిపారు. తల్లిపాలు ఇచ్చే సమయంలో విడుదలయ్యే ఆక్సిటోసిన్, ప్రోలాక్టిన్ హార్మోన్లు ఒత్తిడి,ఆందోళనను తగ్గించి మానసిక ప్రశాంతతను కలిగిస్తాయని వివరించారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ బివి రజని,అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## టీజీ భరత్ పుట్టినరోజుసందర్భంగా గోశాలకు విరాళం

**కర్నూలు ఆగస్ట్ 05మనం న్యూస్ :** రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పుట్టినరోజు సందర్భంగా తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి, టీజీ భరత్ అభిమాని జూటూరు రవి గోశాలకు విరాళం ఇచ్చారు. రూ.55,555లు గాయత్రీ గోసేవ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గాయత్రీ గోశాలకు అందజేశారు. టీజీ భరత్ చేతుల మీదుగా ఈ చెక్కును గాయత్రీ గోశాల అధ్యక్షుడు జగదీష్ గుప్తాకు అందించారు. మంత్రి టీజీ భరత్ చేస్తున్న సేవ కార్యక్రమాలను చూసి తాము కూడా తమ వంతు సమాజానికి సేవ చేస్తున్నట్లు చెప్పారు.

## రాఘవేంద్ర రెడ్డి చెంతకు తిక్కారెడ్డి వర్గం

**మంత్రాలయం , ఆగస్టు 5,మనం న్యూస్ ;** మండల పరిధిలోని మాధవరం గ్రామంలోని తెదేపా కార్యాలయంలో మంత్రాలయం టీడీపీ నియోజకవర్గ బాధ్యులు ఎన్. రాఘవేంద్ర రెడ్డి చెంతకు తిక్కారెడ్డి వర్గీయులైన గొబ్బుర్ చిన్నభీమ ( మాజీ వార్డు నెంబర్) , పెద్దభీమ , రవి , ప్రాణేష్ , అనుచరులు 60 మంది బుధవారం చేరారు. ఆయన వారిని సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా టీడీపీ ఇన్చార్జ్ రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మంత్రాలయం గడ్డపై తెలుగుదేశం పార్టీ జెండా ఎగరవేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని, వ్యక్తిగత భేదాలను పక్కన పెట్టి ఒకే జెండా కింద కలిసి పనిచేయాలని అలాగే రానున్న రోజుల్లో మంత్రాలయం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని మరింత బలంగా తీర్చిదిద్దేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలనీ పిలుపునిచ్చారు. అనంతరం టిడిపి ఇన్చార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి , మాజీ సర్పంచ్ ఎన్. రఘునాథరెడ్డి , టిడిపి యువ నాయకులు రాకేష్ రెడ్డికి చిన్న బీమా శాలువా కప్పి పూలమాలలు వేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంచాల సొసైటీ డైరెక్టర్ తిమ్మప్ప టిడిపి సీనియర్ నాయకులు అశోక్ రెడ్డి ,టిడిపి నాయకులు మడ్రి శివకుమార్ , పేతురు ,డేవిడ్ , మేకల నరసింహ మంగలి మల్లి టీడీపీ కార్యకర్తలు , తదితరులు ఉన్నారు

## 6 నుండి 15 వరుకు జరిగే సిపిఐ ఆధ్వర్యంలో
# జరిగే పాదయాత్రలు జయప్రదం చేయండి

- దేవనకొండలో సిపిఐ – సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ, వాల్ పోస్టర్లు ఆవిష్కరణ కార్యక్రమం
- సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే. మద్దిలేటి శెట్టి పిలుపు

**దేవనకొండ, ఆగస్టు 5, ( మనం న్యూస్ ):** దేవనకొండ:- 12 సంవత్సరాల బిజెపి పరిపాలన కాలంలో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించడంతో ₹మార్పు కావాలి అనే నినాదంతో₹ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా ఆగస్టు 6 నుండి 15 జరిగే పాదయాత్రాలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే. మద్దిలేటి శెట్టి, సిపిఐ మండల కార్యదర్శి ఎం. నరసరావు లు పిలుపునిచ్చారు. బుధవారం నాడు దేవనకొండ ఎమ్మార్వో కార్యాలయ ప్రాంగణం నందు చలో ఢిల్లీ వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బిజెపి పరిపాలన కాలంలో ప్రజల మధ్య మతాల పేరుతో చిచ్చు పెడుతూ అభివృద్ధిని విస్మరించిందని ప్రశ్నించే వారిని దేశద్రోహులంటూ నిర్బంధాలకు గురి చేస్తుందని, భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ నియంతృత్వంగా వ్యవహరిస్తుందని వీరి పాలన కాలంలో దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రస్థాయిలో పెరిగిపోవడమే కాకుండా పరీక్ష పత్రాల లీకులతో విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతుందని, మహిళలకి ఆదివాసులకి రక్షణ లేకుండా పోయిందని ఇలాంటి తరుణంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ప్రజలలో చైతన్యం పెంచి మార్పు కావాలి అనే నినాదంతో ఆగస్టు 6 నుండి 15 వరకు జిల్లా వ్యాప్తంగా పాదయాత్ర నిర్వహిస్తున్నామని, అదేవిధంగా ఎల్ లినో ప్రభావం వల్ల జిల్లా వ్యాప్తంగా వర్షాలు పడకపోవడం వల్ల వేసిన పంటలు భూమిలోనే పోయి రైతులు అప్పుల్లో కూరుకుపోయినరని కావున కర్నూలు జిల్లాలో కరువు జిల్లాగా ప్రకటించి సహాయక చర్యలు చేపట్టాలని, ప్రతి రైతుకు నష్టపరిహారం 50 వేల రూపాయలు ఇవ్వాలని, రైతులు బ్యాంకులో తీసుకున్న అప్పులు మొత్తం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18వ తేదీన వేలాది మంది రైతులతో కలెక్టర్ కార్యాలయం ముట్టడి చేయడం జరుగుతుందని, సెప్టెంబర్ 1వ తేదీన చలో ఢిల్లీ నిర్వహిస్తున్నామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. సమావేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు తిమ్మప్ప కొండప్ప సిపిఐ మండల నాయకులు కృష్ణ, వీరాంజనేయులు, శ్రీనివాసులు, రామాంజనేయులు, రఫీ, లక్ష్మన్న, సుంకన్న ,బజారే, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర మంత్రి టీజీ భరత్ గుప్తాకు
# ఏపీజేఎఫ్ జన్మదిన శుభాకాంక్షలు

**కర్నూలు, ఆగస్టు 5:మనం న్యూస్** రాష్ట్ర పరిశ్రమలు, ఆహార ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తాను ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్స్ ఫోరం (ఏపీజేఎఫ్) జిల్లా ప్రతినిధులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నగరంలోని మౌర్య ఇన్ పరిణయ ఫంక్షన్ హాల్లో జరిగిన కార్యక్రమంలో మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ప్రజా సేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా జర్నలిస్టుల అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు హరినాథ్ రెడ్డి, ఏపీజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి మధుసూదాకర్, జిల్లా నాయకులు టీ వి మనోహర్ కందెనవోలు శ్రీనివాసులు, నాగరాజు, విచక్షణ ఎడిటర్ రాఘురామ్ జి.లక్ష్మయ్య తదితరులు మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం, మీడియా అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రతినిధులు అభినందించారు. మంత్రి టీజీ భరత్ గుప్తా ప్రతినిధులతో ఆప్యాయంగా మాట్లాడి వారి శుభాకాంక్షలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు, ఏపీజేఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

## శ్రీ మఠం హుండీ ఆదాయం
# రూ. 3.65 కోట్లు

- శ్రీమఠ మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు

**మంత్రాలయం,ఆగస్టు 5,(మనం న్యూస్) :** ఆధ్యాత్మిక క్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం ,జూలై , ఆగస్టు నెల 21రోజుల హుండీ ఆదాయం రూ. 3,65,16,531 లు సమకూరినట్లు మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు బుధవారం వెల్లడించారు. బంగారం 49 గ్రాములు , వెండి 865 , గ్రాములను భక్తులు కానుకులుగా హుండీలో సమర్పించుకున్నారని మేనేజర్ తెలిపారు.

## రాష్ట్ర స్థాయి పారా క్రీడల్లో
# ప్రతిభ చాటిన విద్యార్థి బి. విల్సన్ రాజు

- అభినందించిన ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి

**ఎమ్మిగనూరు ఆగస్టు 5 మనం న్యూస్ :** జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించిన బి. విల్సన్ రాజు, .ఐ విభాగంలో షాట్పుట్ మరియు డిస్కస్ త్రో పోటీల్లో పాల్గొని తన ప్రతిభను చాటారు. రాష్ట్ర స్థాయిలో పోటీపడి ఎమ్మిగనూరు నియోజకవర్గానికి గుర్తింపు తీసుకురావడం ఎంతో గర్వకారణమని ఎమ్మెల్యే అన్నారు విల్సన్ రాజు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఆంధ్రప్రదేశ్కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శభాష్ పోలీస్... మహానంది పోలీస్‌లకు జిల్లా ఎస్‌పి అభినందనలు

**మహానంది, ఆగస్ట్5,మనంన్యూస్.** ఇంట్లో ఎవరికీ చెప్పకుండా పారిపోయిన ఇద్దరు విద్యార్థులను గంట వ్యవధిలోనే గుర్తించి తల్లి దండ్రులకు అప్పగించిన మహానంది పోలీస్ లను నంద్యాల జిల్లా ఎస్ పి సునీల్ షోరాన్ అభినందించారు. బుధవారం మహానంది పోలీస్ స్టేషన్ లో నిర్వహించిన సమావేశంలో ఎస్ పి మాట్లాడుతూ మండల పరిధిలోని అబ్బీపురం గ్రామానికి చెందిన జగదీష్, సుదీర్ అనే విద్యార్థులు టీచ్చర్ మందలించిందని ఇంట్లో చెప్పకుండా పారిపోయారు. పిల్లలు కనిపించక పోవడంతో తల్లిదండ్రులు మహానంది పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు.వెంటనే ఎస్ ఐ రామ్మోహన్ రెడ్డి సిబ్బందిలో గాలింపు ప్రారంభించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఆర్ టి జి ఎస్ సీసీ టివి అనే 360సీసీ టివి సమగ్ర పర్యవేక్షణ మరియు సాంకేతిక ఆధారాలను వినియోగించి తప్పిపోయిన విద్యార్థులను గుర్తించారు. ఇంత త్వరగా పిల్లలను వెతికి తల్లిదండ్రులకు అప్పగించిన తాలూకా రూరల్ సి ఐ శ్రీనివాస రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, జగన్ మోహన్, పోలీస్ సిబ్బందిని ఎస్ పి సునీల్ షోరాన్, ఏ ఎస్ పి సుస్మితలు ప్రత్యేకంగా అభినందించారు. అంతకు ముందు తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహానంది పోలీసులు పాల్గొన్నారు.

## డీలర్ షాపుపై
# డిఎస్ఓ విచారణ

**మంత్రాలయం , ఆగస్టు 5,మనం న్యూస్ ;-** మండల పరిదిలోని మాలపల్లి గ్రామంలో చౌకధరల దుకాణం 29 పై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజా రఘువీర్ బుధవారం విచారణ చేపట్టారు. గ్రామంలోని బెస్త నాగలక్షి కి పేరుతో ఉన్న రేషన్ షాపు నెంబరు 29 ని గత మూడు నెలల క్రితం రద్దు చేశారు. లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా తహసీల్దార్ రమాదేవి ఆదేశాల మేరకు గ్రామ విఆర్ఏ మాల జయలక్ష్మి పై డీలర్ షాపును నిర్వహిస్తూ వచ్చారు. గతంలో రేషన్ షాప్ ను నిర్మించిన బెస్త నాగలక్షి మల్లీ జిల్లా కలెక్టర్ కు ధరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో డిఎస్ఓ విచారణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాఘవేంద్ర , విఆర్ఓ లు ఆనందం ,నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# 'గొడవతో శ్రీమఠంలో పసిపాపను వదిలిన తల్లి'

**మంత్రాలయం ,ఆగస్టు 5,మనం న్యూస్** :నందవరం మండలం గురజాల గ్రామానికి చెందిన భార్యాభర్తల ఇంట్లో చిన్న గొడవ జరిగింది. ఆ కోపంతో ఓ తల్లి బుధవారం తన ఏడాది పసిపాపను మంత్రాలయం శ్రీమఠం పరిమళ ప్రసాదం కౌంటర్ వద్ద వదిలి వెళ్లింది. విషయం తెలుసుకున్న మంత్రాలయం ఎస్ఐ మల్లికార్జున తన సిబ్బంది సహాయంతో పాపను స్వాధీనం చేసుకున్నారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ సుమిత్రమ్మ సమక్షంలో తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి పాపను అప్పగించారు. వారికి ఇప్పటికే 3 కూతుర్లు, కొడుకు ఉన్నారని సమాచారం.చిన్న గొడవలకు పిల్లలను ఇలా వదిలివేయడం సరికాదని పోలీసులు, ఐసిడిఎస్ అధికారులు హెచ్చరించారు. ఈ ఘటనలో శ్రీమఠం సెక్యూరిటీ సిబ్బంది సహకరించారు.

# కృష్ణా కాలేజీ రోడ్డులో జీవీఎంసీ ఆకస్మిక తనిఖీలు

- టిఫిన్ సెంటర్లో గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లు స్వాధీనం – ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై రూ.2 వేల జరిమానా

**విశాఖపట్నం, ఆగస్టు 5:** నగరంలోని కృష్ణా కాలేజీ రోడ్డులో ఉన్న శ్రీ సాయి పుల్కా టిఫిన్ సెంటర్లో జీవీఎంసీ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో గృహ వినియోగానికి ఉద్దేశించిన ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నట్లు గుర్తించడంతో అధికారులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే నిషేధిత ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని గుర్తించి రూ.2,000 జరిమానా విధించారు. జీవీఎంసీ జోన్-2 ఏఎస్ఓ కల్యాణి ఆధ్వర్యంలో ఈ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సీఎస్ఆర్ఐ పల్లా మహేష్, ఎన్. నరేష్ తదితర సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు. కృష్ణా కాలేజీ రోడ్డులో ఈ. శ్రీనివాస్ నిర్వహిస్తున్న శ్రీ సాయి పుల్కా టిఫిన్ సెంటర్ను అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాణిజ్య కార్యకలాపాలకు గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్లను ఉపయోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో అక్కడ ఉన్న సంబంధిత గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. అదే టిఫిన్ సెంటర్లో తనిఖీలు కొనసాగించగా నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. నిబంధనల ఉల్లంఘనపై టిఫిన్ సెంటర్కు రూ.2 వేల జరిమానా విధించారు. వాణిజ్య సంస్థలు సంబంధిత నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు. గృహ వినియోగానికి కేటాయించిన గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగించరాదని, అలాగే నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని నివారించాలని స్పష్టం చేశారు. నగరంలో నిబంధనలను ఉల్లంఘించే వ్యాపార సంస్థలపై తనిఖీలు కొనసాగుతాయని, వ్యాపారులు జీవీఎంసీ నిబంధనలను పాటిస్తూ సహకరించాలని అధికారులు సూచించారు.

## 7న విశాఖలో
# భారీ ఉద్యోగ మేళా

- నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి

**విశాఖపట్నం, ఆగస్టు 05:** జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా ఉపాధి కార్యాలయం (టెక్నికల్ క్లరికల్), నేషనల్ కెరీర్ సర్వీస్ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీ శుక్రవారం మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి ఓ ప్రకటనలో తెలిపారు. కంచరపాలెంలోని గరల్స్ ఐటీఐ క్యాంపస్లోని జిల్లా ఉపాధి కార్యాలయ సముదాయంలో ఉదయం 10 గంటల నుంచి ఈ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖ సంస్థలు పాల్గొని అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయని తెలిపారు. ఈ మేళాలో టీసీఐ, ఇన్నోవ్ సోర్స్ (ఎస్సీఐ కార్డ్స్), నవతా రోడ్ ట్రాన్స్పోర్ట్, అపోలో ఫార్మసీ, ఫ్లిప్కార్ట్ డీమార్ట్, ఫాక్స్కాన్, గ్లోరీ వెండర్ టెలికాలర్స్, శుభగృహ, వరుణ్ మోటార్స్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, అపిటోరియా తదితర సంస్థలు పాల్గొంటున్నాయని తెలిపారు. అసిస్టెంట్ సూపర్వైజర్, సేల్స్ మేనేజర్, క్యాషియర్, లాజిస్టిక్స్ ఎగ్జిక్యూటివ్, ఫార్మసిస్ట్, టెలికాలర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఐఫోన్ అసెంబ్లింగ్ ఆపరేటర్, జూనియర్ కెమిస్ట్, ప్రొడక్షన్ అసిస్టెంట్ తదితర ఉద్యోగాలకు నియామకాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఎస్ఎస్సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, ఇతర అర్హతలు కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చన్నారు. అభ్యర్థులు తమ బయోడేటా, విద్యార్హతల ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులు, పాస్పోర్ట్ సైజు ఫోటోలతో హాజరు కావాలని సూచించారు. ఈ మేళా ద్వారా యువతకు మెరుగైన వేతనాలతో పాటు కెరీర్ అభివృద్ధి అవకాశాలు లభిస్తాయని, జిల్లాలోని నిరుద్యోగ యువత అధిక సంఖ్యలో పాల్గొని ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి పిలుపునిచ్చారు. జాబ్ మేళాకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం 9160888066 నంబర్లో సంప్రదించవచ్చని ఆమె సూచించారు.

# రీ సర్వే కార్యక్రమం నందు ఎలాంటి తప్పులు చేయకూడదు

- పిజిఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చే వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలి
- 22(ఏ) కేసుల పరిష్కారం కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్,

**చిత్తూరు, ఆగస్టు,5మనం న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు 22-ఏ అర్జీల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అర్హులైన పట్టాదారులకు ఎలాంటి జాప్య0 లేకుండా న్యాయం జరిగేలా అన్ని స్థాయిల్లో సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రెవిన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి, పి జి ఆర్ ఎస్ వచ్చిన వినతులు, సీఎం ఓ కార్యాలయం నుంచి వచ్చిన వినతులు, రీ సర్వే, వివిధ కోర్టులో కేసులు సంబంధించి కౌంటర్ ఫైల్స్,22 ఎ, భూములపై, పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ, పలు రెవెన్యూ అంశాలపై సమీక్షించారు, ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కే మోహన్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకటేష్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు వేగవంత మెన, పారదర్శకమైన సేవలు అందించడమే మన ప్రధాన కర్తవ్యం అని తెలిపారు వారం వారం నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమంలో వినతల సుమారు రెవెన్యూ అంశాలు 150 నుంచి 170 వరకు అందుతున్నాయని వాటిని క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. వారానికి మండలంలో ఎమ్మార్వోలు 10 సమస్యలు రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తే జిల్లా స్థాయిలో రెవెన్యూ సమస్యలు తగ్గుముఖం పడతాయని ఆదేశించారు.అర్హులైన ప్రతి దరఖాస్తును నిష్పక్షపాతంగా పరిశీలించి సత్వర పరిష్కారం అందించేందుకు రెవిన్యూ టీం కృషి చేయాలని తెలిపారు భూ వివాద రహిత గ్రామాలు లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమా లు నిర్వహిస్తూ భూ సమస్యల పరిష్కా రానికి చర్యలు తీసుకుంటోందన్నారు. 22ఏ నిషేధిత భూముల జాబితాలో పొరపా టున నమోదైన పట్టాభూముల తొలగిం పు అధికారం రెవెన్యూ డివిజనల్ అధి కారులకు బదలాయించడం వల్ల మరింత వేగంగా అర్జీల పరిష్కారం జరగాలన్నారు. రీసర్వేలు తప్పులు దొర్లకుండా నాణ్యమైన రికార్డులు తయారు చేయాలని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలని కోరారు. సరిహద్దుల నిర్ధారణ, భూ రికార్డుల నవీకరణ, మ్యాప్ల తయారీ తదితర ప్రక్రియలను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. రీ సర్వే ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. రామ కుప్పం, బంగారు పాల్యం, పులిచెర్ల, తవణంపల్లి, పెద్దపంజాణి, వీకోట, బైరెడ్డిపల్లి, జీడి నెల్లూరు, ఎమ్మార్వోలతో సీఎం ఓ కార్యాలయం వచ్చిన వినతులపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు, పలమనేర్ ఆర్డిఓ, చిత్తూర్ ఆర్డీవో, నగిరి ఆర్డీవోలతో పలు రెవెన్యూ అంశాలపై సమీక్షించారు ఈ సమావేశంలో డిఎల్ డిఎ రవి, వీడియో కాన్ఫరెన్స్లోఆర్డీవోలు, తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి:డీఎస్పీ విజయ శేఖర్

**తిరుపతి, ఆగస్టు 05 మనం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీసు శాఖ డీజీపీ సూచనల మేరకు, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఆదేశాలతో తిరుమలలోని ఆక్టోపస్ క్యాంపస్, పరిసర ప్రాంతాల్లో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. తిరుమల డీఎస్పీ విజయ శేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, ఆక్టోపస్ సిబ్బంది, పోలీసు అధికారులు పాల్గొని పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపు, వాతావరణ కాలుష్య నివారణతో పాటు భావితరాలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ప్రకృతి సమతుల్యతను కాపాడడంలో మొక్కల పాత్ర అత్యంత కీలకమని పేర్కొంటూ వాటి సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తిరుమల డీఎస్పీ విజయ శేఖర్ మాట్లాడుతూ, మొక్కలు ప్రాణవాయువును అందించడమే కాకుండా కార్బన్ డయాక్సైడ్ను గ్రహించి కాలుష్యాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించే బాధ్యతను స్వీకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, అటవీ శాఖ అధికారులు, ఆక్టోపస్ అధికారులు, సిబ్బంది పాల్గొని మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సహకారాన్ని అందించారు.

# రైతులు ప్రతాయన్మయ పంటలు వేసుకోవాలి

**దేవనకొండ, ఆగస్టు 5, ( మనం న్యూస్ ):** ఎల్ నీనో ప్రభావం ఉన్నందువల్ల వర్షాలు సక్రమంగా కురువకపోవడంతో రైతులు నష్టపోకుండా ప్రత్యామ్ మాయ పంటలను వేసుకోవాలని ఏ ఓ ఉషారాణి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని మాచాపురం గ్రామంలో పొలంబడి పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈరోజు దేవనకొండ మండలం ₹మాచాపురం₹ గ్రామం నందు ₹పొలం పిలుస్తుంది కార్యక్రమం₹ మండల వ్యవసాయ అధికారి ఆ. ఉష రాణి గారి అధ్యక్షతన నిర్వహించడం జరిగినది.ఆ గారు మాట్లాడుతూ, పత్తి పంటలో రసం పీల్చే పురుగులు ఉండడంతో సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు.

అలాగే పంటలు వేసిన ప్రతి రైతు కూడా ₹పంట నమోదు₹ చేయించుకోవాలని తెలియజేశారు. ఇంకా ఎవరైనా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ఇన్సూరెన్స్ ప్రీమియం కట్టని వారు ఉంటే ₹ఆగస్టు 15₹లోపు ప్రీమియం చెల్లించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ మల్లికార్జున, గ్రామ వ్యవసాయ సహాయకురాలు భువనేశ్వరి దేవి, రైతులు పాల్గొన్నారు.

# సీనియర్ ఆటగాళ్లను కాపాడుకోవాలి: రహానే

టెస్టు క్రికెట్ జట్టులో యువ ఆటగాళ్ల కంటే సీనియర్ ప్లేయర్లు ఎక్కువ మంది ఉండాలని అజింక్య రహానే అభిప్రాయపడ్డాడు. ఇటీవల అన్ని ఫార్మాట్ల క్రికెట్కు వీడ్కోలు పలికిన రహానే ఇటీవల ఓ పాడ్కాస్ట్లో పాల్గొని పలు విషయాల గురించి మాట్లాడాడు. టెస్టు క్రికెట్లో భారత్ పూర్వ వైభవం పొందాలంటే ప్రస్తుతం ఉన్న సీనియర్ ఆటగాళ్లను జట్టులో కొనసాగించాలన్నాడు. సీనియర్లు ఒకేసారి ఆటకు దూరమవుతుండటం టీమ్ఇండియాకు సమస్యగా మారిందని 'జింక్స్' పేర్కొన్నాడు.

''గత రెండేళ్లుగా నేను టెస్టు క్రికెట్ ఆడకపోవడంతో ఇంట్లోనే కూర్చొని మ్యాచ్లు వీక్షించా. భారత జట్టు స్వదేశంలోనే మ్యాచ్లు ఓడిపోవడం కూడా చూశా. టెస్టు క్రికెట్ ఆడాలంటే పట్టుదల ఉండాలి. దాన్ని భారత ఆటగాళ్లు పెంపొందించుకుని పోటీతత్వంతో కూడిన క్రికెట్ ఆడాలి. ప్రతి సెషన్ పూర్తిగా ఆడాలి. చాలా జట్లు అలా చేయడం లేదు. నేను ఏ జట్టు గురించి ప్రత్యేకంగా చెప్పదల్చుకోలేదు. భారత టెస్టు క్రికెట్లోకి గత రెండేళ్లలో కొత్త ఆటగాళ్లు వచ్చారు. వారి సంగతి పక్కన పెట్టండి.

టెస్టు జట్టులో 7-8 మంది సీనియర్లు, ఇద్దరు లేదా ముగ్గురు యువ ఆటగాళ్లు ఉండాలనేది నా అభిప్రాయం. కానీ, ఇప్పుడు జట్టు కొత్త వాళ్లతో నిండిపోతోంది. దాదాపుగా సీనియర్ ఆటగాళ్లంతా రిటైర్ అయ్యారు. మిగిలిన అనుభవజ్ఞులైన ఆటగాళ్లను గౌరవించడం చాలా అవసరం. నిజం చెప్పాలంటే టెస్టు క్రికెట్ గురించి నాకు భయంగా ఉంది. ఇది మనుగడ సాగించాలని మనందరం కోరుకోవాలి. ముఖ్యంగా భారత్, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, సౌతాఫ్రికాల్లో టెస్టు క్రికెట్ కొనసాగాలి'' అని రహానే వివరించాడు.

గతేడాది రవిచంద్రన్ అశ్విన్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, ఛెతేశ్వర్ పుజారా వంటి అనుభవజ్ఞులైన ఆటగాళ్లు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. తాజాగా రహానే కూడా రిటైర్మెంట్ ప్రకటించడంతో జట్టులో సీనియర్ల సంఖ్య తగ్గిపోయింది. ప్రస్తుతం భారత జట్టులో రవీంద్ర జడేజా, కేఎల్ రాహుల్, రిషభ్ పంత్, జస్ప్రీత్ బుమ్రా మాత్రమే 50 కంటే ఎక్కువ టెస్టులు ఆడారు.

## ఒక్కడినే విమర్శించడం సరికాదు.. గంభీర్కు మద్దతుగా మాజీ చీఫ్ సెలక్టర్

గౌతమ్ గంభీర్ హెడ్ కోచ్గా వచ్చినప్పటి నుంచి టీమ్ఇండియా పరిమిత ఓవర్ల క్రికెట్లో మంచి ఫలితాలే సాధిస్తోంది. టెస్టుల్లో మాత్రం పేలవ ప్రదర్శన చేస్తోంది. స్వదేశంలో న్యూజిలాండ్, సౌతాఫ్రికాతో జరిగిన సిరీస్లో ఘోర ఓటములను మూటగట్టుకుంది. ఈ ప్రపంచ టెస్టు ఛాంపియన్షిప్లో భారత్ తొమ్మిది మ్యాచ్లు ఆడి నాలుగు విజయాలు, నాలుగు ఓటములతో పాయింట్ల పట్టికలో ఐదో స్థానంలో ఉంది.

గంభీర్ ఒంటెద్దు పోకడల వల్లే టెస్టుల్లో భారత్ పేలవ ప్రదర్శన చేస్తోందని విమర్శలు వస్తున్నాయి. త్వరలో శ్రీలంకతో జరగనున్న రెండు టెస్టుల సిరీస్ గంభీర్కు అగ్నిపరీక్షగా మారింది. ఒకవేళ ఈ సిరీస్ కూడా కోల్పోతే అతనిపై వేటుపడే అవకాశాలు లేకపోలేదు. ఇలాంటి తరుణంలో గంభీర్కు మాజీ చీఫ్ సెలక్టర్ సందీప్ పాటిల్ మద్దతుగా నిలిచాడు. జట్టు వైఫల్యాన్ని ఒక్క వ్యక్తిపైనే మోపలేమన్నాడు.

''శ్రీలంక పర్యటన అందరికీ కీలకం. కేవలం గంభీర్నే ఎందుకు టార్గెట్ చేస్తున్నారు? అతను మంచి ఫలితాలు తేవడంలో విఫలమైతే ఆటగాళ్లు కూడా విఫలమైనట్లే. ఒక్కరినే విమర్శించడం సరికాదు. మన ఆటగాళ్లు స్పిన్నర్లను ఎదుర్కోలేకపోయారు. అందుకే న్యూజిలాండ్తో స్వదేశంలో సిరీస్ ఓడిపోయాం. అంతేకాకుండా కివీస్ ఆటగాళ్లు పూర్తి సన్నద్ధతతో ఇక్కడికి వచ్చారు. వారు స్పిన్కు అనుకూలమైన వికెట్లపై ప్రాక్టీస్ చేశారు. టీమ్ఇండియా మాత్రం బ్యాటింగ్, బౌలింగ్కు అనుకూలించే పిచ్లపై ప్రాక్టీస్ చేసింది. అదే భారత జట్టుకు ప్రతికూలంగా మారింది. అందుకే ఓటములను చవిచూసింది'' అని సందీప్ పాటిల్ పేర్కొన్నాడు.

2007-2008 మధ్య టీమ్ఇండియాకు తాత్కాలిక కోచ్గా వ్యవహరించిన లాల్చంద్ రాజ్పుత్ కూడా గంభీర్కు అండగా నిలిచాడు. కోచ్ అన్నాక ఒడుదొడుకులు సహజమని, ప్రతిసారీ గెలవలేమని పేర్కొన్నాడు. ప్రస్తుతం భారత జట్టు పరివర్తన దశలో ఉందని.. ఇలాంటి సమయంలో ఆటగాళ్లకు, కోచ్కు తగినంత సమయం ఇవ్వాలన్నాడు. రోహిత్, కోహ్లీ వంటి దిగ్గజాలు రెండు ఫార్మాట్ల నుంచి తప్పుకోవడం కూడా టీమ్ఇండియాపై ప్రభావం చూపిస్తోందని లాల్చంద్ రాజ్పుత్ అన్నాడు. ఆగస్టు 15 నుంచి శ్రీలంకతో భారత్ రెండు టెస్టుల సిరీస్లో తలపడనుంది. ఇప్పటికే టీమ్ఇండియా శ్రీలంకకు చేరుకుంది.

## శ్రీలంకతో టెస్టు సిరీస్.. టీమ్ఇండియా ఆటగాళ్ల ప్రాక్టీస్ షురూ..

రెండు టెస్టుల సిరీస్ కోసం శ్రీలంకకు చేరుకున్న శుభ్ మన్ గిల్ నేతృత్వంలోని భారత జట్టు బుధవారం ప్రాక్టీస్ సెషన్ లో పాల్గొంది. ఆగస్టు 7 నుంచి కొలంబోలో శ్రీలంక ఎలెవన్ తో టీమ్ఇండియా మూడు రోజుల వార్మప్ మ్యాచ్ ఆడనుంది. ఈ నెల 15న మొదలయ్యే తొలి టెస్టుకు గాలె ఆతిథ్యమిస్తుండగా.. కొలంబో వేదికగా 23వ తేదీ నుంచి రెండో మ్యాచ్ జరుగుతుంది. టీమ్ఇండియా ఆటగాళ్లు నెట్స్లో ప్రాక్టీస్ చేసిన చిత్రాలు మీకోసం..

## వన్డే వరల్ కప్ డైరెక్ట్ క్వాలిఫికేషన్.. డేంజర్లో వెస్టిండీస్

2027 వన్డే ప్రపంచ కప్ నకు వెస్టిండీస్ నేరుగా అర్హత సాధించే పరిస్థితులు కనిపించడం లేదు. వన్డే ర్యాంకింగ్స్ ఆధారంగా నేరుగా టోర్నీకి అర్హత సాధించడానికి ఐసీసీ ఈ సెప్టెంబర్ 30 వరకు డెడ్ లైన్ విధించింది. వన్డే ర్యాంకింగ్స్ లో టాప్-8లో ఉన్న దేశాలు నేరుగా అర్హత సాధిస్తాయి. వీటితోపాటు సహ-ఆతిథ్య దేశాలుగా సౌతాఫ్రికా, జింబాబ్వే ఆటోమేటిక్ గా క్వాలిఫై అవుతాయి. ప్రస్తుతం ర్యాంకింగ్స్ లో పదో స్థానంలో ఉన్న కరేబియన్ జట్టు.. కటాఫ్ తేదీ నాటికి రెండు వన్డేలు మాత్రమే ఆడనుంది. ఆ రెండూ సెప్టెంబర్ లో భారత్ తోనే జరగనున్నాయి. ఆ రెండింటిలో గెలిచినా విండీస్ టాప్-8లో నిలిచే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. వెస్టిండీస్ భవితవ్యం అఫ్గానిస్థాన్, ఐర్లాండ్ మధ్య జరగనున్న ఐదు వన్డేల సిరీస్ పై ఆధారపడి ఉంది. అఫ్గాన్ ప్రస్తుతం ఎనిమిదో స్థానంలో ఉండగా, ఐర్లాండ్ 12వ స్థానంలో ఉంది. ఒకవేళ ఐర్లాండ్ 4-1 లేదా 5-0 తేడాతో సిరీస్ను గెలిచి.. భారత్ ను విండీస్ రెండు వన్డేల్లోనూ ఓడిస్తే టాప్-8లోకి వచ్చే అవకాశముంది. ఒకవేళ ఐర్లాండ్తో సిరీస్ను అఫ్గాన్ కైవసం చేసుకుంటే వెస్టిండీస్ దాదాపుగా డైరెక్ట్ క్వాలిఫికేషన్కు దూరమవుతుంది. 2023 వరల్ కప్లో వెస్టిండీస్కు ఇలాంటి పరిస్థితే ఎదురైంది. అప్పుడు వన్డే ర్యాంకింగ్స్లో టాప్-8లో నిలవలేక ప్రపంచ కప్ క్వాలిఫైయర్స్ ఆడింది. సూపర్-6 దశలో స్కాట్లాండ్ చేతిలో ఘోర ఓటమి చవిచూసి తన 48 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా వన్డే ప్రపంచకప్పుకు దూరమైంది.

## 'రామాయణ' సినిమాను 'ఆదిపురుష్'తో పోల్చొద్దు: రచయిత మనోజ్

బాలీవుడ్ లో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతోన్న చిత్రం 'రామాయణ'. ఈ సినిమా ట్రైలర్ విడుదలైన నాటి నుంచి వార్తల్లో నిలుస్తోంది. గతంలో వచ్చిన 'ఆదిపురుష్'తో ఈ చిత్రాన్ని పోలుస్తూ కొందరు పోస్టు పెడుతున్నారు. తాజాగా ముంబయిలో జరిగిన ఓ కార్యక్రమంలో 'ఆదిపురుష్' రచయిత మనోజ్ దీనిపై మాట్లాడారు. 'రామాయణ'లో రావణుడి పాత్ర పోషించిన య్పు ప్రశంసలు కురిపించారు.

''యశ్ చాలా మంచి నటుడు. అందులో ఎలాంటి సందేహం లేదు. మన భారతీయ ఇతిహాసాన్ని ప్రపంచ వేదికపైకి తీసుకెళ్లే ఏ సినిమాకైనా నా పూర్తి మద్దతు ఉంటుంది. 'రామాయణ' మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా. ఈ చిత్రాన్ని 'ఆదిపురుష్'తో పోల్చొద్దు. అది ప్రేక్షకుల అంచనాలను అందుకోలేపోయింది. ఆ సినిమా కోసం ప్రతి ఒక్కరూ ఎంతో కష్టపడ్డారు. అయితే, 'ఆదిపురుష్' సంగీతం మంచి ఆదరణ సొంతం చేసుకుంది. ఇప్పుడు రామాయణ మ్యూజిక్ కూడా హిట్ కావడం నాకు చాలా ఆనందంగా ఉంది'' అని మనోజ్ తెలిపారు.

రణ్బీర్ కపూర్ రాముడిగా కనిపించనున్న రామాయణ చిత్రం రెండు భాగాలుగా రానుంది. ఇప్పటికే రెండో భాగం కూడా 50 శాతం షూటింగ్ పూర్తయినట్లు రణ్బీర్ తెలిపారు. రామాయణ లాంటి గొప్ప కథను 10 భాగాలు తీయొచ్చని రెండు భాగాల్లోనే నితీశ్ తివారీ అద్భుతంగా తెరకెక్కిస్తున్నారని ప్రశంసించారు. దీపావళికి ఈ సినిమా మొదటి భాగం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

## అందాల ఆరబోతతో రెచ్చిపోయిన సనమ్ శెట్టి

మోస్ట్ బ్యూటిఫుల్ నటి సనమ్ శెట్టి గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. 2012లో విడుదలైన 'అంబులి' చిత్రంతో వెండితెరకు పరిచయమైన ఈ బ్యూటీ, తెలుగు సహా పలు భాషల్లో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది.

తెలుగులో 'శ్రీమంతుడు', 'సింగం 123', 'ప్రేమికుడు' వంటి చిత్రాల్లో కనిపించి ప్రేక్షకులను అలరించింది. ఒకప్పుడు వరుస అవకాశాలతో కెరీర్ను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లిన సనమ్ శెట్టికి ఇటీవల మాత్రం పెద్దగా సినిమా అవకాశాలు రావడం లేదు.

అయినప్పటికీ సోషల్ మీడియాలో మాత్రం ఆమె క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. ఎప్పటికప్పుడు తన గ్లామరస్ ఫోటోషూట్లను అభిమానులతో పంచుకుంటూ నెట్టింట సందడి చేస్తోంది. తాజాగా సనమ్ శెట్టి తన ఇన్స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్గా మారాయి.

ఈ ఫొటోల్లో ఆమె పలుచటి పింక్ కలర్ చీరకు మ్యాచింగ్ స్లీవ్లెస్ బ్లౌజ్ను జత చేసి ఎంతో స్టైలిష్గా కనిపించింది. చీరను కాస్త పక్కకు జరిపి తన లుక్కు మరింత గ్లామర్ టచ్ ఇచ్చిన ఈ భామ, చేతికి గాజులు, వేళ్లకు ఉంగరాలు, చెవులకు పెద్ద ఇయర్రింగ్స్ ధరించి ఆకట్టుకుంది.

అలాగే అందంగా వదిలిన జుట్టు ఆమె అందాన్ని మరింత హైలైట్ చేసింది. మొత్తంగా ఈ ఫోటోల్లో సనమ్ శెట్టి స్టైలిష్ అండ్ గ్లామరస్ లుక్లో మెరిసిపోవడంతో అభిమానులు వరుసగా లైక్లు, కామెంట్లతో స్పందిస్తున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వైరల్ అవుతున్నాయి.

## అప్పుడు సూర్య కంటే 3 రెట్లు ఎక్కువ సంపాదించా: జ్యోతిక

ఇండస్ట్రీలో క్యూట్ కపుల్ అనగానే గుర్తొచ్చేది సూర్య-జ్యోతికనే. సందర్భం వచ్చినప్పుడల్లా వీరిద్దరూ తమ ప్రేమను తెలుపుతూనే ఉంటారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో సూర్యతో తన బంధం, కెరీర్ ప్రారంభంలో ఉన్న పరిస్థితుల గురించి జ్యోతిక (ఒడ్డొజీజ్చు) పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. కెరీర్ ప్రారంభంలో సూర్య కంటే తానే ఎక్కువ సంపాదించినట్లు తెలిపారు. 'ఆ రోజుల్లో ఆయన పారితోషికం కంటే నా రెమ్యునరేషన్ మూడు రెట్లు ఎక్కువ. ఇప్పుడు అది 30 రెట్లు తగ్గింది' అని సరదాగా చెప్పారు.

''సూర్య ఒక నటుడిగానే కాకుండా భర్తగా చాలా గొప్ప వ్యక్తి. ఆయన మనసులో సమానత్వం మొదటి నుంచే ఉంది. అది సహజంగా పుట్టుకతోనే రావాలి. అమ్మాయిలకు వంట చేయడం రాకపోయినా.. ఏదైనా పని ఇష్టం లేదని చెప్పినా.. సరేనని వదిలేయడం అనేది సాధారణంగా మనం సినిమాల్లో చూస్తుంటాం కదా.. మా ఇంట్లో అచ్చం ఇలానే జరుగుతుంది. నేను ఫెమినిస్టా మాట్లాడటం లేదు.. కానీ మా ఇంట్లో మేమిద్దరం సమానమే. సినిమా నిర్మాణం నుంచి పిల్లల పెంపకం, సెలవుల్లో తిరగడం వరకు ప్రతి విషయంలోనూ మేం కలిసే నిర్ణయం తీసుకుంటాం. ఒకరి ఎదుగుదలను చూసి మరొకరం ఆనందించడమే మాకు అత్యంత ఇష్టమైన పని'' అని ఆమె చెప్పారు.

ఆఫ్స్క్రీన్, ఆన్స్క్రీన్లో హిట్ జోడీ అయిన సూర్య, జ్యోతిక తమిళంలో 'పూవెల్లం కేట్టుప్పార్' మొదలుకొని ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో కలిసి నటించి, మెప్పించారు. ఈ సినిమా సమయంలోనే వీరిద్దరి మధ్య ప్రేమ చిగురించింది. 2006 సెప్టెంబర్ 11న వివాహం చేసుకున్నారు.

## 'రామాయణ'లోకి ఇలా భాగమైన రాకీ భాయ్!

ప్రస్తుతం ఇండియన్ సినిమా నుంచి అత్యంత ప్రతిష్టాత్మకంగా వస్తున్న అతి కొద్ది చిత్రాల్లో బాలీవుడ్ సినిమా తెరకెక్కిస్తున్న సినిమా 'రామాయణ' కూడా ఒకటి. దర్శకుడు నితీష్ తివారి, రణబీర్ కపూర్, సాయి పల్లవి, యష్ ల కలయికలో తెరకెక్కించిన ఈ సినిమా రెండు భాగాలుగా రాబోతుంది. అయితే ఇటీవల వచ్చిన థియేట్రికల్ ట్రైలర్ లో రాకింగ్ స్టార్ యష్ రావణ్ మహారాజ్ గా తన స్క్రీన్ ప్రెజెన్స్ తో మంచి హాట్ టాపిక్ గా మారాడు.

అయితే అసలు రామాయణ అనే భారీ ప్రాజెక్ట్ లోకి యష్ ఎలా ఎంటర్ అయ్యాడు అనేది తెలుస్తుంది. పలు బాలీవుడ్ కథనాల ప్రకారం యష్ అసలు నిర్మాతగా కానీ నటుడిగా కానీ ఈ ప్రాజెక్ట్ కోసం అనుకుంటున్నపుడు భాగం కాదట. ముందుగా నిర్మాత నమిత్ మల్హోత్రా రామాయణం చిత్రాన్ని అత్యంత భారీగా తీయాలి అనే సమయంలో లాస్ ఏంజెల్స్ లో ఉన్నపుడు దాదాపు ఐదేళ్ల కితమే యష్ నటించిన కేజీయఫ్ చాప్టర్ 2 చూసి తన రామాయణంలో రావణ పాత్రకి యష్ సరిగా సరిపోతాడని భావించారట.

అప్పటికి యష్ ని తాను కలిసింది కూడా లేదట. ఆ తర్వాత కలిసినపుడు తన విజన్ ని చెప్పడంతో యష్ నటుడిగానే కాకుండా నిర్మాతగా కూడా ఈ భారీ ప్రాజెక్ట్ లో భాగం అయ్యేందుకు సిద్ధం అయ్యాడని తెలుస్తుంది. సో ఇలా యష్ రామాయణ లోకి ఎంటర్ అయ్యాడట. ఇక ఈ చిత్రానికి హన్స్ జిమ్మర్, రెహమాన్ లు సంగీతం అందిస్తుండగా ఈ ఏడాది దీపావళి కానుకగా సినిమా పాన్ వరల్ లెవెల్లో విడుదల కాబోతుంది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No.New:3-88, Old : 3-22, Chandra Theatre, Gosala, Penamaluru Mandal, Krishna District,(AP),Pin -521151, And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.